
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
బుధవారం 17 జూలై 2024



## ఎర్రమట్టి దిబ్బల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు

- ఆ పరిసరాల్లో గతంలో భీమిలి మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి 373.95 ఎకరాలు కేటాయింపు
- అవన్నీ పట్టించుకోకుండా నెల రోజులుగా పనులు



- మెయిన్‌లో

# ఏయూకు ఇన్‌చార్జి వీసీ?

**రెండు, మూడు వారాల్లో నియామకం**

- రేస్‌లో పలువురు సీనియర్ ప్రొఫెసర్లు
- ఇంచుమించు పది మంది వరకూ...
- తమకు ఉన్న పరిచయాల ద్వారా పైరవీలు
- ఇప్పటికే సమాచార సేకరణలో ప్రభుత్వం
- ఇన్‌చార్జిని నియమించిన తరువాత పూర్తిస్థాయి వీసీ నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం
- ఆ ప్రక్రియ పూర్తయ్యేందుకు ఆరు నెలలు నుంచి ఏడాది సమయం



విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి):

**ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌ను నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత నెలాఖరులో వీసీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ స్టీఫెన్ తమ పదవులకు రాజీనామా చేశారు. స్టీఫెన్ స్థానంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కిశోర్‌బాబును నియమించారు. వీసీ పోస్టు మాత్రం ఖాళీగానే ఉంది. దీంతో అభివృద్ధి పనులు నిలిచిపోవడంతోపాటు కీలక నిర్ణయాలు తీసుకోవడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి వీసీ నియామకం ఇప్పటికిప్పుడు సాధ్యం కానందున రెండు, మూడు వారాల్లో ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌ను నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలిసింది.**

ఏయూతోపాటు రాష్ట్రంలోని ఇతర వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలను ప్రభుత్వం నియమించనున్నది. ఇందుకోసం సమర్థులైన వారిని గుర్తించే బాధ్యతను సీఎం చంద్రబాబు నాయుడు కొందరికి అప్పగించినట్టు తెలుస్తోంది. ఈ విషయం తెలిసి ఏయూలో ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొందరు తమ స్థాయిలో ప్రయత్నాలను చేస్తుండగా, మరికొందరు తమకున్న సీనియారిటీని బట్టి అవకాశం వస్తుందన్న భావనలో ఉన్నారు. ప్రస్తుతం ఏయూ ఇన్‌చార్జి వీసీ రేస్ సుమారు పది మంది ఉన్నారు. వీరిలో మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, ఫారెన్ అఫైర్స్ డీన్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ ధనుంజయ్, ఇంజ నీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శశిభూషణ్, శ్రీకాకుళం యూని వర్సిటీ వీసీగా పనిచేసి, ప్రస్తుతం మెకానికల్ ఇంజ నీరింగ్ విభాగంలో ఉన్న ప్రొఫెసర్ రాంజీ, ఎగ్జామినేషన్ విభాగం డీన్‌గా చేస్తున్న ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, ఏయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, గతంలో ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా చేసి ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ వల్లీ కుమారి, అదే విభా గంలో పనిచేస్తున్న మరో సీనియర్ ప్రొఫెసర్ శశితోపాటు ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీగా పదవీ విరమణ పొందిన మరో సీనియర్ ప్రొఫెసర్ పేరు వినిపిస్తోంది. వీరిలో ఒక సీనియర్ ప్రొఫెసర్ రాజకీయంగా తనకున్న పలుకుబడిని వినియోగిస్తున్నట్టు తెలిసింది. స్పీకర్‌తోపాటు పొరుగు జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి ద్వారా ప్రయత్నాలను సాగిస్తున్నట్టు తెలిసింది. అయితే, ఆయన గత వీసీ ప్రసాదరెడ్డి కోటరీకి చెందిన వ్యక్తి అన్న ప్రచారం సాగుతోంది. ఈ విషయాన్ని కొందరు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు చెబుతున్నారు. అలాగే, నగరానికి చెందిన ఇద్దరు కీలక నేతలు ద్వారా మరో సీనియర్ ప్రొఫెసర్ తన ప్రయత్నాన్ని చేసుకుంటున్నట్టు ... మిగతా 6వ పేజీలో

# సీన్ రివర్స్

- ఫిల్మ్ క్లబ్ కార్యవర్గం నుంచి ఆ నలుగురూ ఔట్



భీమిలి రోడ్డులోని ఫిల్మ్ క్లబ్

- గంటా హెచ్చరికల నేపథ్యంలో తప్పుకున్న కాయల వెంకటరెడ్డి, గోపీనాథరెడ్డి, ప్రసాదరెడ్డి, సాయిరెడ్డి అల్లుడు...
- ఇంకా కొనసాగుతున్న మరో నలుగురు
- సిబ్బంది జీతాల్లో కమీషన్ల కోసమేనా...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భీమిలి రోడ్డులోని ఫిల్మ్ క్లబ్ కథ ఇంకా కంచికి చేర లేదు. ప్రభుత్వం మారిన వెంటనే అందులో కీలకంగా వ్యవహరిస్తున్న పెద్దలు అంతా కార్యవర్గం నుంచి స్వచ్ఛందంగా బయటకు వెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అక్కడకు వెళ్లి మరీ హెచ్చరించారు. ఇది కొంతవరకు పనిచేసింది. క్లబ్‌ను చేతుల్లోకి తీసుకొని అంతా తామై నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు, ఫాలోవర్లు అయిన కాయల వెంకటరెడ్డి, ఎస్ఆర్ షాపింగ్ మాల్ గోపీనాథ్‌రెడ్డి, ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి, సాయిరెడ్డి అల్లుడు తదితరులు అంతా కార్యవర్గం నుంచి వైదొలగారు. అయితే కనీసం సభ్యత్వ రుసుము కూడా కట్టకుండా సభ్యునిగా ఉంటూ కీలకంగా వ్యవహరిస్తున్న వ్యక్తితో పాటు మరో ముగ్గురు... సిబ్బందికి ఇచ్చే జీతాల్లో కమీషన్ల కోసం ఇంకా చూరు పట్టుకొని వేలాడుతున్నారు. వైసీపీ ముఠా చేతుల్లోకి క్లబ్ వెళ్లక ముందు ... మిగతా 6వ పేజీలో

# ఎమ్మెల్సీ టికెట్‌కు వైసీపీలో లొల్లి

**స్థానిక సంస్థల కోటాలో భర్తీ చేయనున్న స్థానం కోసం నేతల మధ్య పోటీ**





కోలా గురువులు

- పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులుకు గతంలో అధిష్ఠానం హామీ
- ఎన్నికల అనంతరం మారిన పరిణామాలు
- తనకు కావాలంటూ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్
- తనకు ఇవ్వాలని మాజీ ఎంపీ ఎంవీవీ పట్టు
- అభ్యర్థి ఎంపికపై అధిష్ఠానం మల్లగుల్లాలు

**వంశీకృష్ణ శ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన స్థానం**



గుడివాడ అమర్‌నాథ్



ఎంవీవీ సత్యనారాయణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీ టికెట్ కోసం లొల్లి మొదలైంది. స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాస్ ఆరు నెలల కిందట పార్టీకి, పదవికి రాజీనామా చేసి జనసేనలో చేరి పోయారు. వంశీకృష్ణశ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన స్థానం కోసం జిల్లాలో ఆ పార్టీ నేతలు పోటీపడుతున్నారు. ఈ వ్యవహారం అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది.**

మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మెజారిటీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. ఈ నేపథ్యంలో 2021 డిసెంబరులో స్థానిక సంస్థల కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ కాగా వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణిలను ఎంపిక చేశారు. అయితే వంశీకృష్ణ గత ఏడాది నవంబరులో వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. పార్టీ ఫిరాయింపు పేరుతో వంశీకృష్ణ శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ పదవికి అనర్హుడిగా శాసన మండలి చైర్మన్ ప్రకటించారు. ఆ స్థానంలో మరొకరిని ఎంపిక చేయాల్సి ఉంది. ఈలోగా సాధారణ ఎన్నికలు వచ్చాయి. దీంతో ఎమ్మెల్సీ ఎంపిక ప్రక్రియ పూర్తికాలేదు. త్వరలో ఎమ్మెల్సీ స్థానాన్ని భర్తీ చేయనుండడంతో వైసీపీలో ఆశావహులు బయటకు వస్తున్నారు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం, 2014లో వైసీపీ తరపున దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కోలా గురువులుకు 2019, 2024 ఎన్నికల్లో పోటీకి పార్టీ అధిష్ఠానం అవకాశం ఇవ్వలేదు. 2023లో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవులకు ఎన్నిక జరిగినప్పుడు గురువులును అధిష్ఠానం పోటీకి దింపింది. అయితే ... మిగతా 6వ పేజీలో

## చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు

- ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల విద్యార్థులకు నిర్వహణ
- ఏమైనా ఇబ్బందులుంటే ఆస్పత్రికి తరలింపు

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి):

అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా మూడేళ్ల నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించనున్నారు. వేసవి సెలవుల తరువాత పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు వచ్చే నెల తొలివారం నుంచి కార్యక్రమం ప్రారంభించనున్నారు. తొలుత అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు, ఆ తరువాత పాఠశాల విద్యార్థులకు స్క్రీనింగ్ చేయనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే వైద్యుడు ప్రతిరోజూ తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు ఆశ, ఏఎన్ఎం, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్‌తో కలిసి వెళ్లి పరీక్షలు నిర్వహించనున్నారు.

**నిర్వహించే పరీక్షలివే...**


చిన్నారులు ఎత్తు, బరువుతోపాటు రక్తహీనత, చర్మ సంబంధిత సమస్యలతోపాటు యాక్టివ్‌గా ఉన్నారా..? లేదా? అనేది పరిశీలించనున్నారు. ఇటీవల వారికి వచ్చిన అనారోగ్య సమస్యలు తెలుసుకుంటారు. ప్రాథమిక పరీక్షల్లో ఇబ్బందులున్నట్టు తేలితే స్థానిక పీహెచ్‌సీకి, పెద్ద సమస్య ఉంటే జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటారు.

**సకాలంలో గుర్తించేలా..**

చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలను గుర్తిస్తే మెరుగైన వైద్యం అందించవచ్చుననే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఏటా రెండు విడతలు ఈ పరీక్షలు చేస్తారు. ప్రధానంగా పుట్టుకతో వచ్చే కొన్నిరకాల వ్యాధులను గుర్తిస్తారు. వీటిలో న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్, డౌన్స్ సిండ్రోమ్, గ్రహణం మొర్రి, పుట్టుకతో వచ్చే కంటి శుక్లం, చెవుడు, గుండె జబ్బులు, రెటినోపతి, ప్రీ మెచ్యూరిటీ, రక్తహీనత, విటమిన్ ఏ, విటమిన్ డి లోపాలు, గాయిటర్ వంటి వ్యాధులను గుర్తించి మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా స్క్రీనింగ్ నిర్వహిస్తారు.



## శ్రీకృష్ణావతారంలో జగన్నాథుడు



రథోత్సవంలో భాగంగా టర్నర్‌చౌల్ట్రీ ఆవరణలో కొలువుదీరిన జగన్నాథుడు మంగళవారం శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శమిచ్చారు. నిత్య పూజల్లో భాగంగా పండితులు మేలుకొలుపు, సహస్రనామార్చన, లలితా పారాయణం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కాగా బుధవారం స్వామి శేషపాన్పు అవతారంలో భక్తులకు దర్శమిస్తారు. గురువారం నిర్వహించనున్న తిరుగు రథయాత్రకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. - పూర్ణామార్కెట్

# విద్యుత్ బకాయిలు రూ. 319.77 కోట్లు

**ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్‌లో ప్రభుత్వ సంస్థల నుంచి రావలసింది రూ.124.03 కోట్లు**

- మైనర్ పంచాయతీల నుంచి రూ.170.76 కోట్లు
- జీవీఎంసీ బకాయి రూ.22.96 కోట్లు
- మునిసిపాలిటీలు రూ.2.03 కోట్లు
- విశాఖ కలెక్టరేట్ రూ.8.18 కోట్లు
- రోడ్లు, భవనాల శాఖ రూ.6.17 కోట్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లోని విశాఖపట్నం సర్కిల్‌కు వివిధ ప్రభుత్వ, స్థానిక పరిపాలన సంస్థల నుంచి రావలసిన బకాయిలు పెరిగిపోతున్నాయి. జూన్ నెలాఖరు నాటికి విశాఖ సర్కిల్‌లో రూ. 319.77 కోట్లు రావలసి ఉంది. ఈ సర్కిల్‌లో అనకాపల్లి, కశింకోట, నర్సీపట్నం, పాడేరు డివిజన్లు గ్రామీణ ప్రాంతంలో ఉన్నాయి.**

జోన్-1, జోన్ 2, జోన్-3 డివిజన్లు విశాకపట్నం నగరంలో ఉన్నాయి. ప్రైవేటు అంటే గృహ, ప్రైవేటు పారిశ్రామిక సంస్థల నుంచి విద్యుత్ బిల్లులు సకాలంలోనే వసూలు అవుతున్నాయి. దాదాపుగా 90 శాతం కలెక్షన్ ఉంటోంది. ఎవరైనా బకాయి ఉంటే వారికి విద్యుత్ కనెక్షన్ తీసేస్తుండడంతో వెంటనే బకాయి చెల్లించి సరఫరా పునరుద్ధరించుకుంటున్నారు. అదే ప్రభుత్వ సంస్థల విషయానికి వచ్చేసరికి అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేయలేకపోతున్నారు. నోటీసులు మీద నోటీసులు ఇవ్వడం తప్పితే అటు నుంచి పెద్దగా స్పందన ఉండడం లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని, అందుకే బిల్లులు చెల్లించలేకపోతున్నామని సదరు ప్రభుత్వ విభాగాల అధిపతులు చెబుతున్నారు. అదేవిధంగా జీవీఎంసీ, మునిసిపాలిటీలు, పంచాయతీలు కూడా విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించడం లేదు. ఎంత ఆలస్యమైనా ఈపీడీసీఎల్ అధికారులు వేచిచూడడం తప్పితే సరఫరా నిలిపివేయలేరనే ధీమా వల్ల స్థానిక సంస్థలు తీరుబడిగా, మిగులు నిధులు ఉన్నప్పుడు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నాయి. జూన్ నెలాఖరు నాటికి ప్రభుత్వ సంస్థల నుంచి రూ.124.03 కోట్లు, మైనర్ పంచాయతీల నుంచి రూ.170.76 కోట్లు, జీవీఎంసీ నుంచి రూ.22.96 కోట్లు, మునిసిపాలిటీల నుంచి రూ.2.03 కోట్లు బకాయిలు రావలసి ఉంది.

డివిజన్ల వారీగా చూసుకుంటే అనకాపల్లి డివిజన్ నుంచి రూ.29.31 కోట్లు, కశింకోట డివిజన్ ... మిగతా 6వ పేజీలో

# గంజాయి కోసం తనిఖీలు

- నగరం నడిబొడ్డున ఉన్న ఖాళీ ప్రదేశాల్లో విస్తృతంగా సోదాలు
- పొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా ఉన్న ప్రాంతాలపైనా దృష్టి



ఆరిలోవలో బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఏపీఐఐసీ భూమిలో తనిఖీ చేస్తున్న పోలీసులు

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి):

గంజాయి నియంత్రణ చర్యల్లో భాగంగా పోలీసులు మంగళవారం నగరంలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. గంజాయి వినియోగంతోపాటు మత్తులో నేరాలకు పాల్పడుతున్నవారి సంఖ్య పెరుగుతుండడంతో 'గుప్పుమంటున్న గంజాయి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన సీపీ శంఖబ్రత బాగ్చీ నగరంలో గంజాయి దాచిపెట్టేందుకు అవకాశం ఉన్న ఖాళీప్రదేశాలు, శివారుప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ప్రతి స్టేషన్ పరిధిలోనూ పిచ్చిమొక్కలు, పొదలు పెరిగివున్న ఖాళీ ప్రాంతాలు, పార్కులు, శివారు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. దసపల్లా హిల్స్, ఏయూ ఇంజనీరింగ్ మైదానం, వన్‌టౌన్‌లోని ... మిగతా 6వ పేజీలో

## పెందుర్తిలో 359 కిలోల గంజాయి స్వాధీనం

**12 మంది అరెస్టు**

పెందుర్తి, జూలై 16: పెందుర్తి పోలీసులు మంగళవారం వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో 359 కిలోల గంజాయి పట్టుకున్నారు. ఈ సందర్భంగా 12 మందిని అరెస్టు చేశారు. వీరిలో ఒక యువతి కూడా ఉంది. నిందితుల వద్ద నుంచి కారు, బైకులు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి వివరాలు వెల్లడించారు.



మాట్లాడుతున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

**కారులో 284 కిలోల గంజాయి**

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు సరిపల్లి వద్ద ఏర్పాటుచేసిన డైనమిక్ చెక్‌పోస్ట్ వద్ద సీఐ ఎల్.రామకృష్ణ మంగళవారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అత్యంత వేగంగా వచ్చిన ఒక కారు చెకపోస్ట్ వద్ద ఆగకుండా వెళ్లిపోవడంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఆ కారును తనిఖీ చేయగా 284 కిలోల గంజాయి లభించింది. ఏజెన్సీ ప్రాంతం నుంచి కారులో నగరానికి ... మిగతా 6వ పేజీలో

## 19న జాబ్‌మేళా

**కంచరపాలెం, జూలై 16 :** కంచరపాలెంలోని జిల్లా ఉపాధికార్యాలయంలో ఈనెల 19వ తేదీ శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధికల్పనాధికారి సీహెచ్. సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎస్‌బీఐ పేటీఎం, షై ట్యాగ్ ఇండస్ట్రీస్, ముత్తూట్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధులు పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు చేపట్టనున్నారన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ తదితర కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులు. ఆసక్తి గల వారు తమ వివరాలను నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే, శుక్రవారం ఉదయం 10గంటలకు అన్నీ ధ్రువపత్రాలతో జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని సుబ్బిరెడ్డి పేర్కొన్నారు.

## బాలికలను చదివించాలి

**సీతంపేట, జూలై 16:** బాలికలపై చిన్నచూపు చూడకుండా వారిని చదివించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు కోరారు. ఈ మేరకు సీతంపేటలో అంగన్‌వాడీ కార్యకర్త లు, ఆశ వర్కర్లు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్, చైల్డ్ సొసైటీ ఆధ్వర్యంలో బేటీ బచావో. బేటీ పడావో పేరిట కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ వార్డు అధ్యక్షుడు నమ్మి రవికుమార్ బాలల హక్కులు రక్షించాలని, బాలల చట్టాలు, బాల్య వివాహాలు నిషేధించాలని ప్రచారం చేశారు.

## 'గాండ్ల, తెలికుల సమస్యల పరిష్కారానికి కృషి'

**మహరాణిపేట, జూలై 16:** గాండ్ల, తెలికుల సామాజిక వర్గాల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి నివేదికలు అందించనున్నట్టు సంఘ చైర్మన్ డాక్టర్ పెబ్బిలి రవికుమార్ తెలిపారు. మంగళవారంమహారాణిపేటలో ఆసోసి యేషన్ భవన్‌లో సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు దాడి సత్యనారాయణ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. నాయకులు ఎర్నేటి తాతారావు, చిత్రాడ అప్పారావు, పేరూరి గణేష్, ఎ. సన్యాసిరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.



# వైభవంగా నూకాలమ్మ అమ్మవారి పండగ

**సీతమ్మధార, జూలై 16:** గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెం గ్రామంలోని నూకాలమ్మ అమ్మవారి పండగను మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేపచెట్టు కిందనున్న అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామ వీధి రామాలయం వద్ద నుంచి అమ్మవారి అనుపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు కలశాలతో జలాలను తీసుకువెళ్లి ఆలయం వద్ద గల వేపచెట్టుకు పూజలు చేశారు. గ్రామ కమిటీ, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.



నక్కవానిపాలెంలో నూకాలమ్మ



అనుపోత్సవంలో కలశాలతో మహిళలు

### కనకదుర్గ అమ్మవారి అనుపోత్సవం



దుర్గమ్మను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న దృశ్యం

**డాబాగార్డెన్స్:** జీవీఎంసీ ప్రధాన కార్యాలయ ఆవరణలోని శ్రీ కనకదుర్గ ఆలయ వార్షిక మహోత్సవాలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. సోమవారం తొలేళ్ల ఉత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం అనుపోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరించి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో అమ్మవారిని ఊరేగించారు. స్థానికులు, ఉద్యోగులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాదవితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఓమ్మి సురేష్‌కుమార్, కేత పోలరాజు, ఎంవీ జనార్దనరావు, ఎం. పోలారావు, జి.ప్రసన్న, కె.భాస్కర్, సంపత్, మధు తదితరులు పాల్గొన్నారు.



నృత్య రూపకంలో పాల్గొన్న చిన్నారులను అభినందిస్తున్న అతిథులు

## ఆకట్టుకున్న శ్రీకృష్ణావతార నృత్య రూపకం

**జగదాంబ కూడలి, జూలై 16:** జగన్నాథుడి ఆలయ ఆవరణలో చిన్నారుల ప్రదర్శించిన శ్రీకృష్ణావతారం నృత్యరూపకం భక్తులను అలరించింది. భారతీ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఈ ప్రదర్శన నిర్వహించారు. చిన్నారులకు ఈవో రాజగోలపారెడ్డి బహుమతులు అందజేశారు. ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. నృత్య గురువు మౌనిక, అర్చకులు జగన్నాథాచార్యులున్నారు.

### సత్యనారాయణ స్వామి దేవస్థానం పట్టు వస్త్రాల సమర్పణ

జగన్నాథుడి రథయాత్ర సందర్భంగా ఇసుక కొండ సత్యనారాయణ స్వామి దేవస్థానంనుంచి పట్టు వస్త్రాలను సమర్పించారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, ఈవో బి.ఎల్. నగేశ్, కె. గాయత్రి జగన్నాథస్వామికి ఈ వస్త్రాలు అందించారు. ముందుగా ఆలయం ఈవో టి.రాజగోపాల రెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మీడియాపై విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు హేయం

» జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

**సీతంపేట, జూలై 16:** రాజ్యాంగ స్ఫూర్తితో మెలిగే మీడియాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీనేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలో ఫోర్త్ ఎస్టేట్‌గా పిలిచే మీడియా, పాత్రికేయులపై విజయసాయిరెడ్డి హేయమైన వ్యాఖ్యలు చేయడంతో దారుణమన్నారు. మీడియా ప్రతినిధులను, యాజమాన్యాలను ఏకవచనంతో మాట్లాడటం ఆయన కుసంస్కారాన్ని తెలియజేస్తోందన్నారు. పెద్దల సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న విజయసాయిరెడ్డి ఇలా వ్యవహరించడం తగదన్నారు. వీటిపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఇటువంటి జారుడుగా మాట్లాడిన ఆయనను రాజ్యసభ నుంచి బహిష్కరించాలని రాజ్యసభ చైర్మన్‌ను కోరుతానన్నారు. శాంతి అనే దేవదాయ శాఖ సహాయ కమిషనర్ విజయసాయిరెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రేమ సమాజం భూముల వ్యవహారంలో రూ. 1.60 కోట్లు విజయసాయిరెడ్డి చెల్లించారంటే దీని వెనుక పెద్ద మొత్తంలో చేతులు మారాయనే అనుమానాలు ఉన్నాన్నారు. శాంతి అడ్డదారుల్లో ఉద్యోగంలో చేరడంలో విజయసాయిరెడ్డి సహకారం ఉన్నట్టు తెలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం నిజాయితీగా ఉన్న అధికారులకు రక్షణగా ఉంటుందన్నారు. శాంతి పలు దేవాలయాల్లో అవకతవకాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయన్నారు.



మాట్లాడుతున్న మూర్తియాదవ్

## పోర్టుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రిలే దీక్షలు



మాట్లాడుతున్న పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

**జగదాంబ కూడలి, జూలై 16:** పోర్టుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 25,26 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్టు యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్, వీడీఎల్‌బీ డాక్ వర్కర్స్ యూనియన్ నాయకుడు కె.సత్యనారాయణ (సీఐటీయూ) తెలిపారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోర్టు కార్మికులకు 2022 నుంచి పెండిగ్‌లో ఉన్న వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బోనస్ వెంటనే చెల్లించాలన్నారు. మేజర్ పోర్టుల ఆస్తుల అమ్మకానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. పోర్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, కళాసీలకు క్యాజువల్ లీవులు, క్యాంటీన్ సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలపై సీహార్స్ జంక్షన్ వద్ద చేపట్టనున్న రిలేనిరాహార దీక్షలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ అర్గనైజింగ్ సెక్రటరీ వి. రామలింగేశ్వరరావు, వీడీఎల్‌బీ అధ్యక్ష, కార్యదర్శులు జె. సత్యనారాయణ పాల్గొన్నారు.

## 4న హ్యాండ్లూమ్ శారీ వాక్

**కంచరపాలెం, జూలై 16 :** హ్యాండ్లూమ్ డేను పురస్కరించుకుని ఆగస్టు 4న ఏడు వేల మంది మహిళలతో హ్యాండ్లూమ్ శారీ వాక్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల విద్యార్థినుల సమక్షంలో ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ శారీ వాక్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఆర్కే బీచ్ కాళీమాత గుడి నుంచి ప్రారంభంకానున్న ఈ వాక్ మూడు కిలోమీటర్ల వరకు సాగుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు, సొసైటీ ప్రతినిధులు ఎస్.రాజ్‌కుమారి, పి.శేఖర్, ఎ.శైలజ, డి. విజయస్వాతి తదితరులు పాల్గొన్నారు.

## 'సేవలు మరింత విస్తృతం చేస్తాం'

**మురళీనగర్, జులై 16 ;** నగరంలో తమ సంస్థ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామని మాధవధార మానవ సేవే మాధవసేవ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. మంగళవారం సంస్థ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ తరఫున పేదలకు చేపడుతున్న సేవా కార్యక్రమాలు వివరించారు.

## సీన్ రివర్స్

... 5వ పేజీ తరువాయి

అక్కడ పనిచేసే సిబ్బందిలో జనరల్ మేనేజర్‌కు రూ.25 వేలు, ఫుడ్ మేనేజర్‌కి రూ.16 వేలు, సూపరింటెండెంట్‌కు రూ.16 వేలు జీతం ఇచ్చేవారు. వైసీపీ ముఠాలో ముగ్గురు కలిసి సిబ్బంది జీతాలు అమాంతం పెంచేశారు. జనరల్ మేనేజర్‌కు రూ.50 వేలు, ఫుడ్ మేనేజర్‌కి రూ.50 వేలు, సూపరింటెండెంట్‌కు రూ.40 వేలు చేశారని సభ్యులు చెబుతున్నారు. అయితే వారికి పూర్తి జీతాలు ఇవ్వకుండా అందులో కొంత మొత్తం వీరు కమీషన్ కింద తీసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇంకా కొనసాగుతున్న ఆ ముఠాలో సభ్యులు అక్కడికి వెళితే సిబ్బంది రాజమర్యాదలు చేస్తున్నారని, వాటి కోసం వారు బయటకు పోకుండా అక్కడే తిష్ట వేశారని సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 21న మళ్లీ క్లబ్ సమావేశం నిర్వహిస్తున్నారు. స్థానికంగా నటులకు శిక్షణ ఇచ్చే వారిలో కొందరు క్లబ్‌లో సభ్యత్వం తీసుకున్నారు. వారు క్లబ్‌కు ఎటువంటి ఫీజులు కట్టకుండా దానిని శిక్షణ కోసం ఉపయోగించుకుంటున్నారని, వారి నుంచి ఎందుకు ఫీజులు వసూలు చేయరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం మారినా ఇంకా వైసీపీ నాయకుల పెత్తనమే సాగుతున్నదని, దీనికి తక్షణమే ఫుల్‌స్టాప్ పెట్టి క్లబ్ నిబంధనల ప్రకారం నడిచేలా ప్రభుత్వంతగిన చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ

**మర్రిపాలెం, జూలై 16:** డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మంగళవారం మర్రిపాలెంలో వైద్య ఆరోగ్యశాఖ అధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 53వ వార్డు టీడీపీ మాజీ కార్పొరేటర్ పొలమరశెట్టి నర్సకుమారి మాట్లాడుతూ డెంగ్యూ సోకకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఖాళీ కొబ్బరిబొండాలు, చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించినట్లయితే వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులతో ప్లకార్డులతో మర్రిపాలెం, జ్యోతినగర్, మహారాణివీధి తదితర కాలనీల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 54వ వార్డు అధ్యక్షుడు కార్తీక్ కుట్టా, మలేరియా వి భాగం సిబ్బంది ఎస్.నాగరాజు, ఎం. కృష్ణమోహన్, సామాజిక కార్యకర్తల భూషణరావు, పాఠశాల కరస్పాండెంట్ డి.వి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ముస్లిం తాటిచెట్లపాలెంలో..

**అక్కయ్యపాలెం :** టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేశ్ ఆధ్వర్యంలో మలేరియా, డెంగ్యూ, అతిసార వాధులపై 44వ వార్డు ముస్లి తాటిచెట్లపాలెంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కాళ్ల గౌరీశంకర్ నా యుడు, బీజేపీ అధ్యక్షుడు ఎస్.రఘునాథ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, నాయకులు సోనా, పుష్ప, ఖుసిడా తదితరులు పాల్గొన్నారు.



మర్రిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## హెల్మెట్ ధారణపై బీచ్‌రోడ్డులో 1కే వాక్ రేపు

**మహారాణిపేట, జూలై 16:** ద్విచక్ర వాహనదారుల హెల్మెట్ ధారణపై అవగాహనకు ఈ నెల 18 వ తేదీన బీచ్ రోడ్డులో 1కే వాక్ నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఎమ్ఎల్ఎస్‌సీలు న్యాయ వాదులు, పీఎల్‌వీలు , విద్యా ర్థుల ఆధ్వర్యంలో 18 వతేదీ ఉదయం 6.30కు బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి పోలీస్ మెస్ వరకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ 1కే వాక్ ప్రజా ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఆ రోజు జిల్లా వ్యాప్తంగా ప్రమాదాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు జరుపుతారని న్యాయమూర్తి తెలిపారు.

# రైళ్లు మళ్లింపు, రీ షెడ్యూల్

**విశాఖపట్నం, జూలై 16:** విజయవాడ డివిజన్ పరిధిలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనుండగా, మరికొన్ని రైళ్లను ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం కె సందీప్ తెలిపారు. ఈనెల 22, 29న ఎర్నాకులం-హౌరా అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22878) వయా రేణుగుంట, ఎర్రగుంట్ల, నంద్యాల, గుంటూరు, కృష్ణా కెనాల్‌మీదుగా, సంత్రాగచ్చి-తంబరం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22841) వయా కృష్ణా కెనాల్, గుంటూరు, నంద్యాల, ఎర్రగుంట్ల, రేణుగుంట, చెన్నై ఎగ్మోర్ మీ దుగా, ఈనెల 22న హౌరా-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22863) వయా కృష్ణా కెనాల్, గుంటూరు, నంద్యాల, ఎర్రగుంట్ల, రేణుగుంట మీదుగా నడుస్తాయి.

### రీ షెడ్యూల్..

ఈనెల 21న మల్దాటౌన్-బెంగళూరు అమృత భారత్ ఎక్స్‌ప్రెస్ (13434), ఈనెల 21, 26న హౌరా-మైసూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22817), ఈనెల 18, 21, 25న హౌరా-తిరుచిరాపల్లి ఎక్స్‌ప్రెస్ (12663), ఈనెల 22, 29న హౌరా-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (12665), ఈ నెల 26న సిలిఘాట్ టౌన్-తంబరం ఎక్స్‌ప్రెస్ (15630), ఈనెల 22న న్యూటిన్సుకియా- తంబరం ఎక్స్‌ప్రెస్ (15930), ఈనెల 23, 26తేదీల్లో సంత్రాగచ్చి-చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (22807) రైళ్లు ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి గంటన్నర ఆలస్యంగా బయలుదేరుతాయి.

### పలు రైళ్ల గమ్యాల కుదింపు

తంబరం స్టేషన్‌లో నిర్మాణ పనులు చేపట్టనున్నందున పలు రైళ్ల గమ్యాలను కుదించినట్టు సీనియర్ డీసీఎం తెలిపారు. దీంతో జసిడిహ్-తంబరం ఎక్స్‌ప్రెస్ (12376) 27న చెన్నై ఎగ్మోర్ వరకు, సంత్రాగచ్చి-తంబరం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22841) ఈనెల 22, 29న చెన్నై బీచ్ వరకు, సిలిఘాట్ టౌన్- తంబరం ఎక్స్‌ప్రెస్ (15630) చెన్నై సెంట్రల్ వరకు, న్యూ టిన్సుకియా-తంబరం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (15930) ఈనెల 22, 29న చెన్నై ఎగ్మోర్ వరకు నడుస్తుంది. పైన పేర్కొన్న రైళ్లు తంబరం స్టేషన్ చేరవని ఆయన స్పష్టం చేశారు. అలాగే తిరుగు ప్రయాణంలోని తంబరం- జసిడిహ్ ఎక్స్‌ప్రెస్ (12375) ఈనెల 27న చెన్నై ఎగ్మోర్ నుంచి, తంబరం- సంత్రాగచ్చి అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22842) ఈనెల 24, 31న చెన్నై ఎగ్మోర్ నుంచి, తంబరం- సిలిఘాట్ టౌన్ ఎక్స్‌ప్రెస్ (15629) ఈనెల 29న చెన్నై ఎగ్మోర్ నుంచి, తంబరం-న్యూ టిన్సుకియా ఎక్స్‌ప్రెస్ (15929) ఈనెల 25న చెన్నై ఎగ్మోర్ నుంచి బయలుదేరుతాయని పేర్కొన్నారు.

### దువ్వాడ మీదుగా తిరునెల్వేలి, షాలిమార్ మధ్య ప్రత్యేక రైలు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వయా దువ్వాడ మీదుగా తిరునెల్వేలి, షాలిమార్ మధ్య ప్రత్యేక రైళ్ల సర్వీసులను ప్రవేశపెడుతున్నట్టు ఆయన తెలిపారు. 06087 నంబరు గల రైలు ఈనెల 18, 25న (ప్రతి గురువారం) తెల్లవారుజాము 1.50 గంటలకు తిరునెల్వేలిలో బయలుదేరి మర్నాడు ఉదయం 4.57 గంటలకు దువ్వాడ, రాత్రి 9.00 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరిగి ఈనెల 20, 27న (ప్రతి శనివారం) సాయంత్రం 5.10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 7.52 గంటలకు దువ్వాడ, సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు తిరునెల్వేలి చేరుతుంది.

## మాజీ వలంటీర్ వీరంగం

» మద్యం మత్తులో వైద్య శిబిరానికి వచ్చి బీభత్సం

» వైద్య పరికరాలు, మందులను చెల్లాచెదురు చేసిన వైనం

» పోలీసులకు సచివాలయ సిబ్బంది ఫిర్యాదు

**మాకవరపాలెం, జూలై 16:** అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం గిడుతూరులో ఓ మాజీ వలంటీర్ మంగళవారం బీభత్సం సృష్టించాడు. 108 సిబ్బందితో కలిసి సచివాలయ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహిస్తుండగా మద్యం మత్తులో అక్కడకు నానా అల్లరి చేశాడు. టేబుళ్లను తిరగేసి మందులను చెల్లాచెదురు చేశాడు. దీనిపై పోలీసులకు సచివాలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా వున్నాయి. గిడుతూరులోని రామాలయం వద్ద ఉన్న భవనంలో 108 సిబ్బంది ప్రతి మంగళవారం వైద్య శిబిరం నిర్వహిస్తుంటారు. సచివాలయ సిబ్బంది అక్కడ సేవలు అందిస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆ సమయంలో మూకల రమణబాబు అనే మాజీ వలంటీర్ అక్కడకు వచ్చాడు. అతను ఎన్నికల ముందు వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కాగా మద్యం మత్తులో వైద్య శిబిరానికి రావడంతో అక్కడ ఉన్నవారంతా ముక్కు మూసుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన మాజీ వలంటీర్ అక్కడ ఉన్న కుర్చీలు, టేబుళ్లను విసిరికొట్టాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఆశ కార్యకర్త పాసపు రామరత్నానికి గాయపడ్డారు. అంతటితో ఆగకుండా అతను రోగులకు ఇవ్వాల్సిన మందులను చెల్లాచెదురు చేశాడు. వైద్య పరికరాలను పగులగొట్టాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఏఎన్ఎం సాయిరెడ్డి నాగలక్ష్మి, ఆశ కార్యకర్త పాసపు రామరత్నం ఫిర్యాదు చేశారు. మాజీ వలంటీర్ రమణబాబుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## ఏయూకు ఇన్‌చార్జి వీసీ?

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. గతంలో శ్రీకాకుళం యూనివర్సిటీకి వీసీగా చేసిన మరో ప్రొఫెసర్ తనకు బంధువైన అధికార పార్టీ ఎమ్మెల్యే ద్వారా తన ప్రయత్నాన్ని గట్టిగానే చేస్తున్నారు. పరిశోధనలు, సీనియారిటీ, ఇంటర్నేషనల్ ప్రాజెక్టు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకని తనకు అవకాశం కల్పిస్తారన్న భావనలో మరో సీనియర్ ప్రొఫెసర్ ఉండగా, వర్సిటీలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలను తానైతే పరిష్కరించగలనన్న భావన ప్రభుత్వ పెద్దల్లో ఉందని, తనకు అవకాశం దక్కుతుందని మరో ప్రొఫెసర్ చెబు తున్నారు. ప్రభుత్వం సదరు సీనియర్ ప్రొఫెసర్ పేరు పరిశీలిస్తున్నట్టు తెలిసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటారన్న భావనను మరో సీనియర్ ప్రొఫెసర్ వ్యక్తం చేస్తున్నారు. వీరితోపాటు బయట నుంచి మరో ఇద్దరు తీవ్రస్థాయిలో ప్రయత్నాలను సాగిస్తున్నారు. ప్రభుత్వం ఎవరికి అవకాశం కల్పిస్తుందో చూడాలి.

### గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడమే తరువాయి

వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన వీసీలంతా గవర్నర్‌కు తమ రాజీనామాలు చేశారు. రాజీనామాలపై గవర్నర్ న్యాయ సలహాను కోరడం వల్లే కొత్త వీసీల నియామక ప్రక్రియలో జాప్యం జరుగుతున్నట్టు చెబు తున్నారు. గవర్నర్ నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన వెంటనే అప్పటికే సిద్ధం చేసిన జాబితాల్లో ఒకరిని ఇన్‌చార్జి వీసీగా నియమించే అవకాశాలు ఉన్నాయి. ఆ తరువాత పూర్తిస్థాయి వీసీ నియామక ప్రక్రియను చేపట్టనున్నారు. ఇందుకు కనీసం ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు దరఖాస్తుల స్వీకరణ, సెర్చ్ కమిటీ నియామకం, ఇతర ప్రక్రియను పూర్తిచేసి పూర్తిస్థాయి వీసీలను నియమించనున్నారు.

## విద్యుత్ బకాయిలు రూ.319.77 కోట్లు

... 5వ పేజీ తరువాయి

నుంచి రూ.91.72 కోట్లు, నర్సీపట్నం నుంచి రూ.39.63 కోట్లు, పాడేరు నుంచి రూ.79.66 కోట్లు బకాయిలు రావలసి ఉంది. విశాఖ నగరంలో చూసుకుంటే జోన్-1 డివిజన్ నుంచి రూ.31.56 కోట్లు, జోన్-2 నుంచి 9.50 కోట్లు, జోన్-3 నుంచి రూ.38.39 కోట్లు వసూలు కావలసి ఉంది.

ఒక్క జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచే రూ.8.18 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఐటీ శాఖ నుంచి రూ.2.42 కోట్లు, పరిశ్రమల శాఖ నుంచి రూ.3.32 కోట్లు, రవాణా, రోడ్లు, భవనాల శాఖ నుంచి రూ.6.17 కోట్లు, పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి రూ.21.4 కోట్ల బిల్లులు వసూలు కావలసి ఉంది. అందరికీ నోటీసులు ఇచ్చామని, ఎంతో కొంత చెల్లించాలని కోరామని సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మహేంద్రనాథ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

## గంజాయి కోసం తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, బీఆర్‌టీఎస్ రోడ్డుని ఆనుకుని ఆరిలోవ ఏపీఐఐసీ భూములు, ముడసర్లోవ పార్కు వంటి ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా ఏజెన్సీ నుంచి గంజాయి తీసుకువచ్చి, పోలీసులకు దొరకకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాల్లో గంజాయి దాచిపెట్టి, అవకాశం దొరకగానే అక్కడి నుంచి తాము ఎంచుకున్న గమ్యానికి చేర్చేలా వ్యూహం పన్ని ఉండవచ్చునని సీపీ అనుమానించి ఉంటారని పోలీస్ సిబ్బంది పేర్కొంటున్నారు. ఒక్కరోజుతో సరిపెట్టేయకుండా,వారానికి ఒక్కసారైనా ఆకస్మికంగా ఇలాంటి తనిఖీలు చేస్తే నగరంలోగంజాయికిచాలావరకుఅడ్డుకట్టపడుతుందని సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

## పెందుర్తిలో 359 కిలోల గంజాయి స్వాధీనం

... 5వ పేజీ తరువాయి

గంజాయి రవాణా చేస్తునట్టు పోలీసులు విచారణలో వెల్లడైంది. ఇందుకు సంబంధించి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంద్రజిత్‌సింగ్ (27), విశాఖ కంచరపాలేనికి చెందిన గమ్మెలి తిరుపతి (22), ఒడిశాకు చెందిన రాజేశ్‌పట్నాయిక్ (34), కోరాపుట్‌కు చెందిన బజింగ రఘు (30), ఒడిశాకు చెందిన పాటికర్ (32), కోరాపుట్‌కు చెందిన పాంగీ (19), మాచ్‌ఖండ్‌కు చెందిన శశీంద్ర (31)లను అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంద్రజిత్‌సింగ్ కుటుంబంతో పెందుర్తిలో నివాసం ఉంటున్నారు. పోర్టులో బొగ్గు కొనుగోలు చేసి ఉత్తరప్రదేశ్‌కు ఎగుమతి చేసేవాడు. అతనికి అరకులోయకు చెందిన హరి పరిచయం అయ్యాడు. సులభంగా డబ్బు సంపాదించవచ్చుననే ఉద్దేశంతో అతని ద్వారా గంజాయిని తెప్పించుకుని యూపీకి పంపడం మొదలెట్టాడు. అలాగే రాజేశ్ పట్నాయక్ ఒడిశా నుంచి వలస వచ్చి విజయనగరం జిల్లా నెల్లిమర్లలో ఇల్లు అద్దెకు తీసుకుని గంజాయి నిల్వ చేస్తుంటాడు. పాటికర్, పాంగీ, శశీంద్ర, రఘ గంజాయి రవాణాకు స్లీపర్ సెల్స్‌గా పనిచేస్తున్నారని ఏసీపీ తెలిపారు.

### పెందుర్తిలో ఓ ఇంటిలో 75 కిలోల గంజాయి

అల్లూరి సీతారామరాజు జిల్లా జీకె వీధి మండలం ఆర్కే నగర్‌కు గొల్లూరి నాగు (22), అదే జిల్లాకు చెంది విశాఖలో ఫిజియోథెరపీ కోర్సు చదువుతున్న యువతి (19) పెందుర్తి పులగాలిపాలెం శివారు ప్రాంతంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని నివాసముంటున్నారు. అదే జిల్లాకు చెందిన గుంట ప్రసాద్, గురుమూర్తిలు ఏజెన్సీ ఒడిశా ప్రాంతం నుంచి తెప్పించిన గంజాయిని వారి ఇంట్లో నిల్వ చేస్తుంటారు. ఇలా నిల్వ చేసిన గంజాయిని ప్యాకింగ్ చేసి ఢిల్లీకి చెందిన సెంథిల్ అనే వ్యక్తికి విక్రయిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న సీఐ ఎల్.రామకృష్ణ, ఎస్ఐ సింహాచలం ఆ ఇంటిపై దాడులు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఐదుగురినీ అరెస్టు చేశారు.

## ఎమ్మెల్సీ టికెట్‌కు వైసీపీలో లొల్లి

... 5వ పేజీ తరువాయి

కొంతమంది ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడంతో గురువులు ఓటమి పాలయ్యారు. తర్వాత పార్టీ ఆయన్ను పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతోపాటు డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించింది. వంశీకృష్ణ శ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాన్ని పార్టీకి విధేయుడిగా ఉన్న కోలా గురువులుకు కేటాయిస్తారని పార్టీ నేతలంతా అభిప్రాయం వ్యక్తంచేసేవారు. అయితే ఇటీవల సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం తర్వాత పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. పార్టీ కోసం తీవ్రంగా కష్టపడడంతోపాటు ఎన్నికల్లో భారీగా డబ్బులు ఖర్చు చేసినందున తనకు ఎమ్మెల్సీ ఇవ్వాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అధిష్ఠానాన్ని కోరినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. మరో ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉంటూ అధికార పార్టీపై పోరాటం చేయాలంటే తనకు ఏదో ఒక చట్టబద్ధమైన పదవి అవసరమని అమర్‌నాథ్ అడిగినట్టు పేర్కొంటున్నారు. మరోవైపు గడిచిన ఎన్నికల్లో దాదాపు రూ.వంద కోట్లు వరకూ ఖర్చు పెట్టడంతో కూటమి ప్రభుత్వం తనను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు ప్రారంభించిందని, వాటన్నింటినీ తట్టుకుని నిలబడాలంటే చట్టబద్ధమైన పదవి ఉంటేనే తప్ప సాధ్యం కాదని మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అధిష్ఠానానికి మొరపెట్టుకున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. తనకు ఆర్థికంగా ఇబ్బంది లేకపోయినప్పటికీ ఏదోరకంగా కేసుల్లో ఇరికించే అవకాశం ఉన్నందున ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని ఆయన కోరుతున్నట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఇదిలావుంటే కోలా గురువులు మాత్రం తనకు అధిష్ఠానం అన్యాయం చేయదని ధీమాగా ఉన్నారు. ఇటీవల నగరానికి వచ్చిన పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి వద్ద ముగ్గురు నేతలు ఈ విషయం కదిపారు. ఎవరికి వారు తమకే ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఆయన తల పట్టుకున్నట్టు సమాచారం. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుటామని వారికి సుబ్బారెడ్డి చెప్పినట్టు తెలిసింది.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

## శివారు గ్రామాలకు బస్సు సదుపాయం

**'300ఎన్' సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే గణబాబు**

**ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గోపాలపట్నం మీదుగా సబ్బవరానికి రోజుకు ఐదు ట్రిప్పులు**

**గోపాలపట్నం, జూలై 16:** ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గోపాలపట్నం శివారు గ్రామాలను కలుపుతూ సబ్బవరం వరకు నడిచేలా 300ఎన్ నంబర్‌తో కూడిన బస్సు సర్వీసును మంగళవారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దంన్నర క్రితం శివారు గ్రామాలకు నడిచే పలు ఆర్టీసీ బస్సులను కొన్ని కారణాల వల్ల నిలిపి వేశారన్నారు. ప్రస్తుతం బస్సు సర్వీసులు నడవడానికి అన్ని అడ్డంగులు తొలగడంతో తొలి విడతగా ఒక బస్సును ప్రారంభించామన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గోపాలపట్నం శివారు గ్రామాలను కలుపుతూ సబ్బవరం వరకు వెళ్లే ఈ బస్సు రోజుకు ఐదు ట్రిప్పులు తిరుగుతుందని పేర్కొన్నారు. ప్రయాణికుల డిమాండ్‌ను అనుసరించి అవసరమైతే అదనంగా మరొక బస్సును నడపడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలరాజు, డిప్యూటీ సీటీఎం సత్యనారాయణ, సింహాచలం డిపో డీఎం రాజశేఖర్, కార్పొరేటర్ దాడి వెంకరమేశ్, బొడ్డేటి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బీసీ వంతెనపై రాకపోకలకు అనుమతించాలని గణబాబుకు వినతి

**మల్కాపురం, జూలై 16:** డాక్‌యార్డు సమీపంలోని సర్దార్ వల్లాభాయ్ పటేల్ వంతెనను త్వరలో మూసివేస్తున్న నేపథ్యంలో షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ) వారధిపై వాహనాల రాకపోకలకు అనుమతులిచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే గణబాబుకు సీపీఎం జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రమాదకరంగా ఉన్న డాక్‌యార్డు వంతెనకు మరమ్మతులు చేపడుతున్నందున ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టేలా జిల్లా, నావికాదళ అధికారులతో చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక ప్రాంత ప్రజలు అత్యవసర సమయంలో కేజీహెచ్, ప్రైవేటు ఆస్పత్రులకు, ఉద్యోగులు, కార్మికులు విధులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు.

## దోమల నివారణపై అవగాహన



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

**అగనంపూడి, జూలై 16:** దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ 79వ వార్డు పరిధి జాజులవానిపాలెంలో జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మలేరియా విభాగం సిబ్బంది స్థానికులకు కరపత్రాలను పంపిణీ చేసి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇళ్ల ముందు ప్లాస్టిక్ డబ్బాలు, కొబ్బరిబొండాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెంది మలేరియా, చిక్కున్‌గున్యా వంటి వ్యాధులు విజృంభించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది గంగునాయుడు, పీవీఎన్ మూర్తి, రమణ, శ్యామలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో వాహనాలకు వేలం

**ఉక్కుటౌన్‌షిప్, జూలై 16:** స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో అన్ క్లయిమ్డ్ ద్విచక్ర వాహనాలకు గురువారం వేలం నిర్వహించనున్నట్టు గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం జరుగుతుందని, ఆసక్తి గలవారు ఇందులో పాల్గొనవలసిందిగా కోరారు.

## నిరాధార ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తా..

**69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి**

**అక్కిరెడ్డిపాలెం, జూలై 16:** వ్యక్తిగత కక్షతో తుంగ్లాంకు చెందిన కొందరు తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, అటువంటి వారిపై పరువు నష్టం దావా వేస్తానని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తెలిపారు. తుంగ్లాంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై చేసిన ఫిర్యాదులు, ఆరోపణలు నిరాధారమైనవని అధికారులు, స్థానికులు పేర్కొన్నా మళ్లీ ఆరోపణలకు దిగం బాధాకరంగా ఉందన్నారు. అటువంటి వ్యక్తులపై క్రిమినల్ కేసు పెట్టి, పరువు నష్టం దావా వేస్తానన్నారు.

### వ్యక్తిగత కక్షతోనే గోవిందరెడ్డిపై ఆరోపణలు

గ్రేటర్ 69వ వార్డు వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్న కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డిపై కొంతమంది వ్యక్తిగత కక్షతోనే నిరాధారమైన ఆరోపణలు చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేయడం భావ్యం కాదని తుంగ్లాం కాలనీలోని పలు సంక్షేమ సంఘాల నాయకులు పేర్కొన్నారు. తుంగ్లాం గ్రామ యువజన సంఘం, వేమన సంఘం, మార్కండేయ సంక్షేమ సంఘంతో పాటు పలు యువజన సంఘాల ప్రతినిధులు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోవిందరెడ్డిపై వస్తున్న ఆరోపణలను ఖండించారు. తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న తుంగ్లాంలో తన తండ్రి పేరుతో గోవిందరెడ్డి సొంత నిధులతో ఆర్వో వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయడంతో పాటు ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి స్థలాన్ని దానం చేశారని, అటువంటి వ్యక్తిపై తప్పుడు ఫిర్యాదులు చేయడం శోచనీయమని సంఘం నాయకులు కొల్లి అప్పలరెడ్డి, నావన సింహచలం పేర్కొన్నారు.

## గీత కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలని వినతి



జెడ్పీకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకుడు సాధూరావు

**పెదగంట్యాడ, జూలై 16:** పారిశ్రామిక ప్రాంతంలోని గీత కార్మికులకు తగిన ఆర్థిక సహకారాన్ని అందించాలని కోరుతూ టీడీపీ 66వ వార్డు అధికార ప్రతినిధి నెల్లి సాధూరావు జెడ్పీ జి.సన్యాసి నాయుడుకు వినతిపత్రం అందజేశారు. గాజువాక ప్రాంతంలో గీత కార్మికులు అధికంగా ఉన్నారని, వీరు వృత్తిపరంగా చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెట్లు ఎక్కేటప్పుడు కిందపడి ప్రాణాలు కోల్పోవడం, కాళ్లు, చేతులు విరిగిపోవడం వంటివి జరుగుతున్నాయని, అటువంటి కుటుంబాలకు నష్టపరిహారం అందించడంతో పాటు పింఛన్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అండిబోయిన పెద నూకరాజు, గీత కార్మిక సంఘం నాయకులు బత్తిన పరదేశి, ఎన్.గురుమూర్తి, కె.ఈశ్వరరావు, లక్ష్మణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆషాఢ ఏకాదశి పూజలకు ఆలయాలు ముస్తాబు

**కూర్మన్నపాలెం, జూలై 16:** ఆషాఢ ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం జరిగే పూజలకు శ్రీవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. 87వ వార్డు రాజులపాలెంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, 88వ వార్డు గ్రీన్ సిటీలోని వైభవ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నట్టు ఆలయ కమిటీల ప్రతినిధులు తెలిపారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.



రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన సిమెంటు బారికేడ్లు



బారికేడ్ల మూలంగా బారులుతీరి నిలిచిపోయిన వాహనాలు

# సుసర్ల కాలనీ రోడ్డులో వాహనదారులకు ఇక్కట్లు

**రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలని వేడుకోలు**

**ఎన్.ఎ.డి. జంక్షన్, జూలై 16:** జీవీఎంసీ 90వ వార్డు పరిధి బాజీ జంక్షన్ నుంచి సుసర్లకాలనీ రోడ్డులో తరచూ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నాయి. ఇక్కడి బాజీ జంక్షన్ కూడలి నుంచి సుసర్లకాలనీకి వెళ్లే మార్గంలో కార్లు, భారీ వాహనాలు రాకుండా ట్రాఫిక్ పోలీసులు సిమెంటు బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో సుసర్ల కాలనీ నుంచి నేరుగా బాజీ జంక్షన్‌కు వెళ్లాల్సిన వారు కొందరు తెలియక కార్లు, ఇతర వాహనాలతో ఈ మార్గంలో నేరుగా రావడం.. ఇక్కడి బారికేడ్లను చూసి వెనక్కి మరలే ప్రయత్నంలో ఇక్కట్లకు గురికావడం పరిపాటిగా మారింది. దీంతో వెనకా, ముందు వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం వాటిల్లుతోంది. రోజూ ఏదో ఒక సమయంలో ఈ సమస్య పునరావృతం అవుతుందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయని చెబుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణ పేరిట బారికేడ్లతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. అందువల్ల ఉన్నతాధికారులు స్పందించి రహదారి మధ్యలో ఉన్న బారికేడ్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

# వైభవంగా తిరుగు రథయాత్ర

**కల్కి అవతారంలో ఉన్న జగన్నాథస్వామిని దర్శించేందుకు తరలివచ్చిన భక్తులు**





అగనంపూడిలో రథాన్ని లాగుతున్న భక్తులు. (ఇన్‌సెట్లో) రథంలో కొలువుదీరిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి

**అగనంపూడి, జూలై 16:** అగనంపూడిలో మంగళవారం సాయంత్రం తిరుగు రథయాత్ర వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా జగన్నాథస్వామి మంగళవారం కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఇంద్రజ్యుమ్న మందిరంలో కొలువుదీరిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులకు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భ్రామరాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. సాయంత్రం స్వామివారి తిరుగు రథయాత్రను నిరహించారు. జగన్నాథ, బలభద్ర, సుభద్రల విగ్రహాలను రథంపై అధిష్టింపజేశాక కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, బొండా జగన్‌లు యాత్రను ప్రారంభించారు. భక్తులు రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. జై జగన్నాథ.. జైజై జగన్నాథ అంటూ భక్తులు స్మరిస్తూ రథాన్ని లాగారు. రథయాత్ర ఇంద్రజ్యుమ్న మందిరం నుంచి అగనంపూడి కూడలి మీదగా ఆలయం వరకు కోలాహలంగా సాగింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గల్లా సాయికుమార్, నాగేశ్వరరావు, నాగమణి, కుమారి, వరదరాణి, ఆలయ మేనేజర్ జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.



హరిజన జగ్గయ్యపాలెంలో దెబ్బతిన్న కల్వర్టు


## దెబ్బతిన్న కల్వర్టు.. భీతిల్లుతున్న ప్రజలు

**అక్కిరెడ్డిపాలెం, జూలై 16:** హరిజన జగ్గయ్యపాలెం ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు దెబ్బతినడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. షీలానగర్ ప్రధాన రహదారి నుంచి హరిజన జగ్గయ్యపాలెం కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు పైనుంచి కొద్దిరోజుల క్రితం లారీలు వంటి భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో కల్వర్టు ఒకవైపు విరిగిపోయింది. దీనిపై నుంచి కాలనీవాసులకు సంబంధించిన కార్లు, ఆటోలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో కల్వర్టుపై ఉన్న రంధ్రం మరింత పెద్దది కావడంతో స్థానికులు భీతిల్లుతున్నారు. రాత్రిపూట దీనిపై నుంచి రాకపోకలు సాగిస్తూ ఇప్పటికే పలువురు ప్రమాదాల బారినపడ్డారని పలువురు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కల్వర్టు పైనుంచి దిచక్ర వాహనాలు తప్ప కార్లు, ఆటోలు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. అందువల్ల అధికారులు స్పందించి దెబ్బతిన్న కల్వర్టుకు తక్షణమే మరమ్మతులు చేపట్టవలిందిగా కాలనీవాసులు కోరుతున్నారు.

## అశోక్‌నగర్‌లో తాగునీటి కష్టాలు

**కొన్ని ఇళ్లకు సన్నని ధారలా కొళాయిల నుంచి నీరు**


**మరికొన్ని ఇళ్లకు అసలు నీరే రావడం లేదని వాపోతున్న ప్రజలు**



ఓ కొళాయి నుంచి వస్తున్న నీరు

**పెదగంట్యాడ, జూలై 16:** జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్ కాలనీలో తాగునీటి సరఫరా తీరు ఘోరంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని కొన్ని ఇళ్లకు అతి తక్కువ నీరొస్తే, మరికొన్ని ఇళ్లకు అసలు కొళాయిల నుంచి నీరే రావడం లేదని వాపోతున్నారు. సంవత్సరాల తరబడి ఇదే పరిస్థితి నెలకొందని వారు చెబుతున్నారు. కొండ దిగువ ప్రాంతంలో ఉన్న అశోక్‌నగర్‌లో 11 వీధులు, సుమారు 450 ఇళ్లు ఉన్నాయి. ప్రధాన రోడ్డును ఆనుకుని ఉన్న వీధుల్లోని మొదటి పది ఇళ్లకు సన్నని ధారలా రోజు విడిచి రోజు కొళాయిల నుంచి నీరు వస్తుంది. ఆపైభాగాన ఉన్న ఇళ్లకు అసలు నీరే వావడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈ సమస్యపై కాలనీవాసులు అనేకసార్లు జీవీఎంసీ అధికారులకు, కార్పొరేటరుకు, ఎమ్మెల్యేకు వినతులు సమర్పించినా సమస్య మాత్రం శాశ్వత పరిష్కారానికి నోచుకోవడం లేదు. కాలనీ ఎగువ భాగాన వాటర్ ట్యాంకు నిర్మిస్తే తప్ప తాగునీటి సమస్య పరిష్కారం కాదని చెబుతున్నారే తప్ప ఇప్పటివరకు ఇందుకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు లేవు. అందువల్ల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమను తాగునీటి కష్టాల నుంచి గట్టెక్కించాలని అశోక్‌నగర్ కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఘనంగా పైడితల్లమ్మ పండగ



అమ్మవారి సన్నిధిలో పంచకర్ల, గోవింద్, తదితరులు

**పెందుర్తి, జూలై 16:** పెందుర్తి ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ అమ్మవారి పండగను తాండ్రపాపారాయుడు వెలమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పీఏసీఎస్ చైర్మన్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణం వద్ద నిర్వహించిన అన్న సమారాధనను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించగా, వందలాది మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అంతకు ముందు ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పీలా గోవింద్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, వైసీపీ నాయకుడు శరగడం చినఅప్పలనాయుడుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పైడితల్లమ్మను దర్శించుకున్నారు.

అనంతరం ఘటాలతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి అనుపోత్సవాన్ని చేపట్టారు. సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, జనసేన నాయకుడు గొర్లె అప్పారావు, డీబీఎల్ నాయుడు, జి.శ్రీనివాసరావు, దాసరి శ్రీను, బండారు నాగు, తదితరులు పాల్గొన్నారు.

### ములగాడలో కుంచమాంబ అనుపోత్సవం

**మల్కాపురం:** ములగాడలో పది రోజులుగా నిర్వహిస్తున్న పండగలో భాగంగా కుంచమాబ అమ్మవారి అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో వారు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

### వేపగుంటలో మోదకొండమ్మ జాతర

**వేపగుంట:** వేపగుంట బీసీకాలనీలో మోదకొండమ్మ ప్రధాన పండగ నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అర్చనలు చేశారు. ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మోదకొండమ్మను దర్శించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలించ్చారు. అనంతరం ఎమ్మెల్యేలు అన్న సమారాధనను ప్రారంభించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.



దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

## ఉక్కు పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలి

**పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ**

**కూర్మన్నపాలెం, జూలై 16:** స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి చేయవలసిందిగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,251వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయిస్తే పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. ముడిసరకు కొరత వల్ల ఉత్పత్తి కుంటుపడుతుందన్నారు. కొన్ని సాంకేతిక కారణాలతో స్టీల్‌ప్లాంటుకు ప్రమాదకర పరిస్థితి పొంచి ఉందన్నారు. అందువల్ల కూటమి ప్రభుత్వం కేంద్రంతో చర్చించి సెయిల్, ఎన్ఎండీసీల ద్వారా ప్లాంట్‌కు ముడిసరకు అందేలా చూడాలని కోరారు. స్టీల్‌ప్లాంటుకు ఉన్న అన్ని సమస్యలు సమసిపోవాలంటే కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వరసాల శ్రీనివాసరావు, కేఎస్ఎన్ రావు, పరంధామయ్య, యు.రామస్వామి, గంగవరం గోపి, నమ్మి సింహాద్రి, ఆనంద్‌తో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## మహా యజ్ఞంలా జనసేన సభ్యత్వ నమోదు

**పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు**

**పెందుర్తి, జూలై 16:** జనసేన పార్టీ సభ్యత్వ నమోదును మహా యజ్ఞంలా చేపట్టాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సుజాతనగర్‌లోని ఇంద్రాణి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్తల సమావేశంలో ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు జరిగే ఈ ప్రక్రియలో నియోజకవర్గానికి సంబంధించి లక్ష సభ్యత్వాలను నమోదు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పంచకర్ల సభ్యత్వ నమోదు విధి, విధానాలను వివరించారు. సభ్యత్వ నమోదో కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. సభ్యత్వ నమోదును అందరూ ఒక గౌరవంగా భావించాలన్నారు. జనసేనాని పవన్‌కల్యాణ్ నేతృత్వంలో పార్టీ మహా వృక్షంగా ఎదగనున్నదన్నారు. ఈ సమావేశంలో నాయకులు అయిత సింహాచలం, పిళ్లా జగన్మోహన్‌పాత్రుడు, డీబీఎల్ నాయుడు, గొర్లె అప్పారావు, సోమశేఖర్‌నాయుడు, రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### 'వార్డులోని సమస్యల పరిష్కారానికి కృషి'

**అగనంపూడి, జూలై 16:** జీవీఎంసీ 79వ వార్డు పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. వార్డు పరిధిలోని శనివాడ వేపచెట్టు జంక్షన్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న ప్రధాన సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ముఖ్యంగా డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో మురుగు పోయేందుకు దారి లేకపోవడంతో ఇళ్ల మధ్య నీరు నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బహుళ అంతస్తులు నిర్మించి బిల్డర్లు డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడంతో ఈ దుస్థితి నెలకొందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నిలిచిపోయిన మురుగును రౌతు శ్రీనివాస్ పరిశీలించారు. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి సదరు బిల్డర్లకు నోటీసులు జారీ చేయిస్తానన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

## గురు పౌర్ణమి వేడుకలకు హాజరు కావాలంటూ 'పల్లా'కు ఆహ్వానం

**అగనంపూడి, జూలై 16:** ఇక్కడి షిర్డీసాయి ఆలయంలో ఈ నెల 21న గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నామని, ఇందులో పాల్గొనవలసిందిగా కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును మంగళవారం షిర్డీ సాయి సేవా సమితి ప్రతినిధులు కలిసి ఆహ్వానించారు. ఆ రోజు సాయినాథునికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు అన్న సమారాధనను చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. పల్లాను కలిసిన వారిలో సేవా సమితి ప్రతినిధులు కొయ్య వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ, టీడీపీ నాయకులు గల్లా రాజు, గంతకోరు అప్పారావు, తదితరులు ఉన్నారు.

## నీటి సరఫరాకు అంతరాయం రేపు

**గాజువాక, జూలై 16:** జీవీఎంసీ గాజువాక జోన్ పరిధి సుందరయ్యకాలనీలో గల తాగునీటి శుద్ధి కర్మాగారంలో మరమ్మతు పనులు చేపట్టనున్నందున గురువారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. అందువల్ల 70, 73, 74, 75, 64 వార్డులకు నీటి సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి తమకు సహకరించాలని కోరారు. భవిష్యత్తులో నీటి సరఫరాలో ఎటాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు మరమ్మతు పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

## టీడీపీ ఆధ్వర్యంలో కాలువ శుభ్రం

**మల్కాపురం, జూలై 16:** ములగాడ రైతుబజారులోని కాలువను టీడీపీ నాయకుడు విశ్వనాథుల దినకర్ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు శుభ్రం చేశారు. ఇటీవల ఎమ్మెల్యే గణబాబు ఈ రైతు బజారును సందర్శించినప్పుడు పలువురు కాలువ సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు ఈ పనులు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు పూడి భాస్కర్, ఎం.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకులకు నైపుణ్య శిక్షణ

**పెందుర్తి, జూలై 16:** పెందుర్తిలోని ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో మంగళవారం కరస్పాండెంట్ టి.థియోఫిలస్ ఆధ్వర్యంలో విద్యా విధానం, మార్పు సాంకేతికత అంశాలలో అధ్యాపకులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రైనర్లు సీకే బాబు, రాజేశ్‌లు గుణాత్మకత, సృజనాత్మకత అంశాలపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. ప్రిన్స్‌పాల్ ఫ్లోరా, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటలపై అవగాహన

**ఎన.ఎ.డి.జంక్షన్, జూలై 16:** జీవీఎంసీ 52వ వార్డు పరిధి మర్రిపాలెం రైతుబజారులో జిల్లా ఉద్యానవనశాఖ అధికారులు మంగళవారం రైతులకు ఉద్యానవన పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ పంటల సాగు విధానం, బిందు సేద్యం, పురుగుల మందుల వాడకం తగ్గించడం, విత్తన శుద్ధి, విత్తనాల కొనుగోలుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అడిగిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి సోని, విస్తరణ శాఖాధికారి త్రినాథ్, రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ కె.వరహాలు, సహాయకుడు ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

## అతిసారపై అప్రమత్తంగా ఉండాలి

**కూర్మన్నపాలెం, జూలై 16:** అతిసార, సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ కోరారు. 87వ వార్డు వడ్లపూడిలోని తెలకల వీధి, కణితి రజక వీధి, సంతమామిడి తోట కాలనీలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలక నీళ్ల విరేచనాలు, వాంతులు, తలనొప్పి, కడుపు నొప్పి, జ్వరం వస్తే అతిసారగా పరిగణించి తక్షణమే కణితి పీహెచ్‌సీకి తీసుకువచ్చి చికిత్స చేయించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కణితి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## సినిమా గైడ్

● **భారతీయుడు-2:** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి).

● **కల్కి:** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా:** శ్రీవెంకటేశ్వర, శ్రీ నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

## రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 58, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 70, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజీ 30, క్యారెట్ 28, దొండకాయలు 30, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 140, మునక్కాడలు (కిలో) 100, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 40, కీరదోస 26, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 56, దేముడుచిక్కుడు 95, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

### కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 575 |
| విజయనగరం | 579 |
| శ్రీకాకుళం | 579 |

### చికెన్ ధరలు

బ్యాగ్

| | |
|---|---|
| రైతు ధర | -- 90 |
| ఫారం ధర | -- 110 |
| విత్ స్కిన్ | -- 190 |
| స్కిన్‌లెస్ | -- 200 |

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..

## 19న జాబ్‌మేళా

**కంచరపాలెం, జూలై 16 :** కంచరపాలెం లోని జిల్లా ఉపాధికార్యాలయంలో ఈనెల 19వ తేదీ శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధికల్పనాధికారి సీహెచ్. సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎస్‌బీఐ పేటీఎం, షై ట్యాగ్ ఇండస్ట్రీస్, ముత్తూట్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధులు పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు చేపట్టనున్నారన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ తదితర కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులు. ఆసక్తి గల వారు తమ వివరాలను నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే, శుక్రవారం ఉదయం 10గంటలకు అన్నీ ధ్రువపత్రాలతో జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని సుబ్బిరెడ్డి పేర్కొన్నారు.

## బాలికలను చదివించాలి

**సీతంపేట, జూలై 16:** బాలికలపై చిన్న చూపు చూడకుండా వారిని చదివించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు కోరారు. ఈ మేరకు సీతంపేటలో అంగన్‌వాడీ కార్యకర్త లు, ఆశ వర్కర్లు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్, చైల్డ్ సొసైటీ ఆధ్వర్యంలో బేటీ బచావో. బేటీ పడావో పేరిట కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ వార్డు అధ్యక్షుడు నమ్మి రవికుమార్ బాలల హక్కులు రక్షించాలని, బాలల చట్టాలు, బాల్య వివాహాలు నిషేధించాలని ప్రచారం చేశారు.

## 'గాండ్ల, తెలికుల సమస్యల పరిష్కారానికి కృషి'

**మహారాణిపేట, జూలై 16:** గాండ్ల, తెలికుల సామాజిక వర్గాల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి నివేదికలు అందించనున్నట్టు సంఘ చైర్మన్ డాక్టర్ పెబ్బిలి రవికుమార్ తెలిపారు. మంగళవారంమహారాణిపేటలో అసోసియేషన్ భవన్‌లో సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు దాడి సత్యనారాయణ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు ఎర్నేటి తాతారావు, చిత్రాడ అప్పారావు, పేరూరి గణేష్, ఎ. సన్యాసిరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.



# వైభవంగా నూకాలమ్మ అమ్మవారి పండగ

**సీతమ్మధార, జూలై 16:** గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెం గ్రామంలోని నూకాలమ్మ అమ్మవారి పండగను మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేపచెట్టు కిందనున్న అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామ వీధి రామాలయం వద్ద నుంచి అమ్మవారి అనుపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు కలశాలతో జలాలను తీసుకువెళ్లి ఆలయం వద్ద గల వేపచెట్టుకు పూజలు చేశారు. గ్రామ కమిటీ, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

### కనకదుర్గ అమ్మవారి అనుపోత్సవం



దుర్గమ్మను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న దృశ్యం

**డాబాగార్డెన్స్:** జీవీఎంసీ ప్రధాన కార్యాలయ ఆవరణలోని శ్రీ కనకదుర్గ ఆలయ వార్షిక మహోత్సవాలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. సోమవారం తొలేళ్ల ఉత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం అనుపోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరించి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో అమ్మవారిని ఊరేగించారు. స్థానికులు, ఉద్యోగులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాదవితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఓమ్మి సురేష్‌కుమార్, కేత పోలరాజు, ఎంవీ జనార్దనరావు, ఎం. పోలారావు, జి.ప్రసన్న, కె.భాస్కర్, సంపత్, మధు తదితరులు పాల్గొన్నారు.



నక్కవానిపాలెంలో నూకాలమ్మ



అనుపోత్సవంలో కలశాలతో మహిళలు



నృత్య రూపకంలో పాల్గొన్న చిన్నారులను అభినందిస్తున్న అతిథులు

## ఆకట్టుకున్న శ్రీకృష్ణావతార నృత్య రూపకం

**జగదాంబ కూడలి, జూలై 16:** జగన్నాథుడి ఆలయ ఆవరణలో చిన్నారుల ప్రదర్శించిన శ్రీకృష్ణావతారం నృత్యరూపకం భక్తులను అలరించింది. భారతీ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఈ ప్రదర్శన నిర్వహించారు. చిన్నారులకు ఈవో రాజగోపాలరెడ్డి బహుమతులు అందజేశారు. ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. నృత్య గురువు మౌనిక, అర్చకులు జగన్నాథాచార్యులున్నారు.

### సత్యనారాయణ స్వామి దేవస్థానం పట్టు వస్త్రాల సమర్పణ

జగన్నాథుడి రథయాత్ర సందర్భంగా ఇసుక కొండ సత్యనారాయణ స్వామి దేవస్థానంనుంచి పట్టు వస్త్రాలను సమర్పించారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, ఈవో బి.ఎల్. నగేశ్, కె. గాయత్రి జగన్నాథ స్వామికి ఈ వస్త్రాలు అందించారు. ముందుగా ఆలయం ఈవో టి.రాజగోపాల రెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మీడియాపై విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు హేయం

» జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

**సీతంపేట, జూలై 16:** రాజ్యాంగ స్ఫూర్తితో మెలిగే మీడియాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీనేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలో ఫోర్త్ ఎస్టేట్‌గా పిలిచే మీడియా, పాత్రికేయులపై విజయసాయిరెడ్డి హేయమైన వ్యాఖ్యలు చేయడంతో దారుణమన్నారు. మీడియా ప్రతినిధులను, యాజమాన్యాలను ఏకవచనంతో మాట్లాడటం ఆయన కుసంస్కారాన్ని తెలియజేస్తోందన్నారు. పెద్దల సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న విజయసాయిరెడ్డి ఇలా వ్యవహరించడం తగదన్నారు. వీటిపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఇటువంటి జారుడుగా మాట్లాడిన ఆయనను రాజ్యసభ నుంచి బహిష్కరించాలని రాజ్యసభ చైర్మన్‌ను కోరుతానన్నారు. శాంతి అనే దేవదాయ శాఖ సహాయ కమిషనర్ విజయసాయిరెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రేమ సమాజం భూముల వ్యవహారంలో రూ. 1.60 కోట్లు విజయసాయిరెడ్డి చెల్లించారంటే దీని వెనుక పెద్ద మొత్తంలో చేతులు మారాయనే అనుమానాలు ఉన్నాన్నారు. శాంతి అడ్డదారుల్లో ఉద్యోగంలో చేరడంలో విజయసాయిరెడ్డి సహకారం ఉన్నట్టు తెలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం నిజాయితీగా ఉన్న అధికారులకు రక్షణగా ఉంటుందన్నారు. శాంతి పలు దేవాలయాల్లో అవకతవకాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయన్నారు.



మాట్లాడుతున్న మూర్తియాదవ్

## పోర్టుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రిలే దీక్షలు

**జగదాంబ కూడలి, జూలై 16:** పోర్టుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 25,26 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్టు యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్, వీడీఎల్‌బీ డాక్ వర్కర్స్ యూనియన్ నాయకుడు కె.సత్యనారాయణ (సీఐటీయూ) తెలిపారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోర్టు కార్మికులకు 2022 నుంచి పెండిగ్‌లో ఉన్న వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బోనస్ వెంటనే చెల్లించాలన్నారు. మేజర్ పోర్టుల ఆస్తుల అమ్మకానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. పోర్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, కళాసీలకు క్యాజువల్ లీవులు, క్యాంటీన్ సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలపై సీహార్స్ జంక్షన్ వద్ద చేపట్టనున్న రిలేనిరాహార దీక్షలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ అర్గనైజింగ్ సెక్రటరీ వి. రామలింగేశ్వరరావు, వీడీఎల్‌బీ అధ్యక్ష, కార్యదర్శులు జె. సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

## 4న హ్యాండ్లూమ్ శారీ వాక్

**కంచరపాలెం, జూలై 16 :** హ్యాండ్లూమ్ డేను పురస్కరించుకుని ఆగస్టు 4న ఏడు వేల మంది మహిళలతో హ్యాండ్లూమ్ శారీ వాక్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల విద్యార్థినుల సమక్షంలో ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ శారీ వాక్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఆర్కే బీచ్ కాళీమాత గుడి నుంచి ప్రారంభంకానున్న ఈ వాక్ మూడు కిలోమీటర్ల వరకు సాగుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు, సొసైటీ ప్రతినిధులు ఎస్.రాజ్‌కుమారి, పి.శేఖర్, ఎ.శైలజ, డి. విజయస్వాతి తదితరులు పాల్గొన్నారు.

## 'సేవలు మరింత విస్తృతం చేస్తాం'

**మురళీనగర్, జూలై 16 ;** నగరంలో తమ సంస్థ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామని మాధవధార మానవ సేవే మాధవసేవ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. మంగళవారం సంస్థ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ తరఫున పేదలకు చేపడుతున్న సేవా కార్యక్రమాలు వివరించారు.

## సీన్ రివర్స్

... 5వ పేజీ తరువాయి

అక్కడ పనిచేసే సిబ్బందిలో జనరల్ మేనేజర్‌కు రూ.25 వేలు, ఫుడ్ మేనేజర్‌కి రూ.16 వేలు, సూపరింటెండెంట్‌కు రూ.16 వేలు జీతం ఇచ్చేవారు. వైసీపీ ముఠాలో ముగ్గురు కలిసి సిబ్బంది జీతాలు అమాంతం పెంచేశారు. జనరల్ మేనేజర్‌కు రూ.50 వేలు, ఫుడ్ మేనేజర్‌కి రూ.50 వేలు, సూపరింటెండెంట్‌కు రూ.40 వేలు చేశారని సభ్యులు చెబుతున్నారు. అయితే వారికి పూర్తి జీతాలు ఇవ్వకుండా అందులో కొంత మొత్తం వీరు కమీషన్ కింద తీసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇంకా కొనసాగుతున్న ఆ ముఠాలో సభ్యులు అక్కడికి వెళితే సిబ్బంది రాజమర్యాదలు చేస్తున్నారని, వాటి కోసం వారు బయటకు పోకుండా అక్కడే తిష్ఠ వేశారని సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 21న మళ్లీ క్లబ్ సమావేశం నిర్వహిస్తున్నారు. స్థానికంగా నటులకు శిక్షణ ఇచ్చే వారిలో కొందరు క్లబ్‌లో సభ్యత్వం తీసుకున్నారు. వారు క్లబ్‌కు ఎటువంటి ఫీజులు కట్టకుండా దానిని శిక్షణ కోసం ఉపయోగించుకుంటున్నారని, వారి నుంచి ఎందుకు ఫీజులు వసూలు చేయరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం మారినా ఇంకా వైసీపీ నాయకుల పెత్తనమే సాగుతున్నదని, దీనికి తక్షణమే ఫుల్‌స్టాప్ పెట్టి క్లబ్ నిబంధనల ప్రకారం నడిచేలా ప్రభుత్వంతగిన చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

## మాజీ వలంటీర్ వీరంగం

» మద్యం మత్తులో వైద్య శిబిరానికి వచ్చి బీభత్సం
» వైద్య పరికరాలు, మందులను చెల్లాచెదురు చేసిన వైనం
» పోలీసులకు సచివాలయ సిబ్బంది ఫిర్యాదు

**మాకవరపాలెం, జూలై 16:** అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం గిడుతూరులో ఓ మాజీ వలంటీర్ మంగళవారం బీభత్సం సృష్టించాడు. 108 సిబ్బందితో కలిసి సచివాలయ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహిస్తుండగా మద్యం మత్తులో అక్కడకు నానా అల్లరి చేశాడు. టేబుళ్లను తిరగేసి మందులను చెల్లాచెదురు చేశాడు. దీనిపై పోలీసులకు సచివాలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా వున్నాయి. గిడుతూరులోని రామాలయం వద్ద ఉన్న భవనంలో 108 సిబ్బంది ప్రతి మంగళవారం వైద్య శిబిరం నిర్వహిస్తుంటారు. సచివాలయ సిబ్బంది అక్కడ సేవలు అందిస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆ సమయంలో మూకల రమణబాబు అనే మాజీ వలంటీర్ అక్కడకు వచ్చాడు. అతను ఎన్నికల ముందు వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కాగా మద్యం మత్తులో వైద్య శిబిరానికి రావడంతో అక్కడ ఉన్నవారంతా ముక్కు మూసుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన మాజీ వలంటీర్ అక్కడ ఉన్న కుర్చీలు, టేబుళ్లను విసిరికొట్టాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఆశ కార్యకర్త పాసపు రామరత్నానికి గాయపడ్డారు. అంతటితో ఆగకుండా అతను రోగులకు ఇవ్వాల్సిన మందులను చెల్లాచెదురు చేశాడు. వైద్య పరికరాలను పగులగొట్టాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఏఎన్ఎం సాయిరెడ్డి నాగలక్ష్మి, ఆశ కార్యకర్త పాసపు రామరత్నం ఫిర్యాదు చేశారు. మాజీ వలంటీర్ రమణబాబుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## ఏయూకు ఇన్‌చార్జి వీసీ?

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. గతంలో శ్రీకాకుళం యూనివర్శిటీకి వీసీగా చేసిన మరో ప్రొఫెసర్ తనకు బంధువైన అధికార పార్టీ ఎమ్మెల్యే ద్వారా తన ప్రయత్నాన్ని గట్టిగానే చేస్తున్నారు. పరిశోధనలు, సీనియారిటీ, ఇంటర్నేషనల్ ప్రాజెక్టు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తనకు అవకాశం కల్పిస్తారన్న భావనలో మరో సీనియర్ ప్రొఫెసర్ ఉండగా, వర్సిటీలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలను తానైతే పరిష్కరించగలనన్న భావన ప్రభుత్వ పెద్దల్లో ఉందని, తనకు అవకాశం దక్కుతుందని మరో ప్రొఫెసర్ చెబు తున్నారు. ప్రభుత్వం సదరు సీనియర్ ప్రొఫెసర్ పేరు పరిశీలిస్తున్నట్టు తెలిసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటారన్న భావనను మరో సీనియర్ ప్రొఫెసర్ వ్యక్తం చేస్తున్నారు. వీరితోపాటు బయట నుంచి మరో ఇద్దరు తీవ్రస్థాయిలో ప్రయత్నాలను సాగిస్తున్నారు. ప్రభుత్వం ఎవరికి అవకాశం కల్పిస్తుందో చూడాలి.

### గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడమే తరువాయి

వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన వీసీలంతా గవర్నర్‌కు తమ రాజీనామాలు చేశారు. రాజీనామాలపై గవర్నర్ న్యాయ సలహాను కోరడం వల్లే కొత్త వీసీల నియామక ప్రక్రియలో జాప్యం జరుగుతున్నట్టు చెబు తున్నారు. గవర్నర్ నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన వెంటనే అప్పటికే సిద్ధం చేసిన జాబితాల్లో ఒకరిని ఇన్‌చార్జి వీసీగా నియమించే అవకాశాలు ఉన్నాయి. ఆ తరువాత పూర్తిస్థాయి వీసీ నియామక ప్రక్రియను చేపట్టనున్నారు. ఇందుకు కనీసం ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు దరఖాస్తుల స్వీకరణ, సెర్చ్ కమిటీ నియామకం, ఇతర ప్రక్రియను పూర్తిచేసి పూర్తిస్థాయి వీసీలను నియమించనున్నారు.

## విద్యుత్ బకాయిలు రూ.319.77 కోట్లు

... 5వ పేజీ తరువాయి

నుంచి రూ.91.72 కోట్లు, నర్సీపట్నం నుంచి రూ.39.63 కోట్లు, పాడేరు నుంచి రూ.79.66 కోట్లు బకాయిలు రావలసి ఉంది. విశాఖ నగరంలో చూసుకుంటే జోన్-1 డివిజన్ నుంచి రూ.31.56 కోట్లు, జోన్-2 నుంచి 9.50 కోట్లు, జోన్-3 నుంచి రూ.38.39 కోట్లు వసూలు కావలసి ఉంది.

ఒక్క జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచే రూ.8.18 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఐటీ శాఖ నుంచి రూ.2.42 కోట్లు, పరిశ్రమల శాఖ నుంచి రూ.3.32 కోట్లు, రవాణా, రోడ్లు, భవనాల శాఖ నుంచి రూ.6.17 కోట్లు, పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి రూ.21.4 కోట్ల బిల్లులు వసూలు కావలసి ఉంది. అందరికీ నోటీసులు ఇచ్చామని, ఎంతో కొంత చెల్లించాలని కోరామని సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మహేంద్రనాథ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

## గంజాయి కోసం తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, బీఆర్‌టీఎస్ రోడ్డుని ఆనుకుని ఆరిలోవ ఏపీఐఐసీ భూములు, ముడసర్లోవ పార్కు వంటి ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా ఏజెన్సీ నుంచి గంజాయి తీసుకువచ్చి, పోలీసులకు దొరకకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాల్లో గంజాయి దాచిపెట్టి, అవకాశం దొరకగానే అక్కడి నుంచి తాము ఎంచుకున్న గమ్యానికి చేర్చేలా వ్యూహం పన్ని ఉండవచ్చునని సీపీ అనుమానించి ఉంటారని పోలీస్ సిబ్బంది పేర్కొంటున్నారు. ఒక్కరోజుతో సరిపెట్టేయకుండా,వారానికి ఒక్కసారైనా ఆకస్మికంగా ఇలాంటి తనిఖీలు చేస్తే నగరంలోగంజాయికిచాలావరకుఅడ్డుకట్టపడుతుందని సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

## పెందుర్తిలో 359 కిలోల గంజాయి స్వాధీనం

... 5వ పేజీ తరువాయి

గంజాయి రవాణా చేస్తున్నట్టు పోలీసులు విచారణలో వెల్లడైంది. ఇందుకు సంబంధించి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంద్రజిత్‌సింగ్ (27), విశాఖ కంచరపాలేనికి చెందిన గమ్మెలి తిరుపతి (22), ఒడిశాకు చెందిన రాజేశ్‌పట్నాయిక్ (34), కోరాపుట్‌కు చెందిన బజింగ రఘు (30), ఒడిశాకు చెందిన పాటికర్ (32), కోరాపుట్‌కు చెందిన పాంగీ (19), మాచ్‌ఖండ్‌కు చెందిన శశీంద్ర (31)లను అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంద్రజిత్‌సింగ్ కుటుంబంతో పెందుర్తిలో నివాసం ఉంటున్నారు. పోర్టులో బొగ్గు కొనుగోలు చేసి ఉత్తరప్రదేశ్‌కు ఎగుమతి చేసేవాడు. అతనికి అరకులోయకు చెందిన హరి పరిచయం అయ్యాడు. సులభంగా డబ్బు సంపాదించవచ్చుననే ఉద్దేశంతో అతని ద్వారా గంజాయిని తెప్పించుకుని యూపీకి పంపడం మొదలెట్టాడు. అలాగే రాజేశ్ పట్నాయక్ ఒడిశా నుంచి వలస వచ్చి విజయనగరం జిల్లా నెల్లిమర్లలో ఇల్లు అద్దెకు తీసుకుని గంజాయి నిల్వ చేస్తుంటాడు. పాటికర్, పాంగీ, శశీంద్ర, రఘు గంజాయి రవాణాకు స్లీపర్ సెల్స్‌గా పనిచేస్తున్నారని ఏసీపీ తెలిపారు.

### పెందుర్తిలో ఓ ఇంటిలో 75 కిలోల గంజాయి

అల్లూరి సీతారామరాజు జిల్లా జీకె వీధి మండలం ఆర్కే. నగర్‌కు గొల్లూరి నాగు (22), అదే జిల్లాకు చెంది విశాఖలో ఫిజియోథెరపీ కోర్సు చదువుతున్న యువతి (19) పెందుర్తి పులగాలిపాలెం శివారు ప్రాంతంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని నివాసముంటున్నారు. అదే జిల్లాకు చెందిన గుంట ప్రసాద్, గురుమూర్తిలు ఏజెన్సీ ఒడిశా ప్రాంతం నుంచి తెప్పించిన గంజాయిని వారి ఇంట్లో నిల్వ చేస్తుంటారు. ఇలా నిల్వ చేసిన గంజాయిని ప్యాకింగ్ చేసి ఢిల్లీకి చెందిన సెందిల్ అనే వ్యక్తికి విక్రయిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న సీఐ ఎల్.రామకృష్ణ, ఎస్ఐ సింహాచలం ఆ ఇంటిపై దాడులు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఐదుగురినీ అరెస్టు చేశారు.

## ఎమ్మెల్సీ టికెట్‌కు వైసీపీలో లొల్లి

... 5వ పేజీ తరువాయి

కొంతమంది ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడంతో గురువులు ఓటమి పాలయ్యారు. తర్వాత పార్టీ ఆయన్ను పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతోపాటు డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించింది. వంశీకృష్ణ శ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాన్ని పార్టీకి విధేయుడిగా ఉన్న కోలా గురువులుకు కేటాయిస్తారని పార్టీ నేతలంతా అభిప్రాయం వ్యక్తంచేసేవారు. అయితే ఇటీవల సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం తర్వాత పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. పార్టీ కోసం తీవ్రంగా కష్టపడడంతోపాటు ఎన్నికల్లో భారీగా డబ్బులు ఖర్చు చేసినందున తనకు ఎమ్మెల్సీ ఇవ్వాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అధిష్ఠానాన్ని కోరినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. మరో ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉంటూ అధికార పార్టీపై పోరాటం చేయాలంటే తనకు ఏదో ఒక చట్టబద్ధమైన పదవి అవసరమని అమర్‌నాథ్ అడిగినట్టు పేర్కొంటున్నారు. మరోవైపు గడిచిన ఎన్నికల్లో దాదాపు రూ.వంద కోట్లు వరకూ ఖర్చు పెట్టడంతో కూటమి ప్రభుత్వం తనను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు ప్రారంభించిందని, వాటన్నింటినీ తట్టుకుని నిలబడాలంటే చట్టబద్ధమైన పదవి ఉంటేనే తప్ప సాధ్యం కాదని మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అధిష్ఠానానికి మొరపెట్టుకున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. తనకు ఆర్థికంగా ఇబ్బంది లేకపోయినప్పటికీ ఏదోరకంగా కేసుల్లో ఇరికించే అవకాశం ఉన్నందున ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని ఆయన కోరుతున్నట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఇదిలావుంటే కోలా గురువులు మాత్రం తనకు అధిష్ఠానం అన్యాయం చేయదని ధీమాగా ఉన్నారు. ఇటీవల నగరానికి వచ్చిన పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి వద్ద ముగ్గురు నేతలు ఈ విషయం కదిపారు. ఎవరికి వారు తమకే ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఆయన తల పట్టుకున్నట్టు సమాచారం. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుటామని వారికి సుబ్బారెడ్డి చెప్పినట్టు తెలిసింది.

# డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ

**మర్రిపాలెం, జూలై 16:** డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మంగళవారం మర్రిపాలెంలో వైద్య ఆరోగ్యశాఖ అధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 53వ వార్డు టీడీపీ మాజీ కార్పొరేటర్ పొలమరశెట్టి నర్సకుమారి మాట్లాడుతూ డెంగ్యూ సోకకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఖాళీ కొబ్బరిబొండాలు, చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించినట్లయితే వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులతో ప్లకార్డులతో మర్రిపాలెం, జ్యోతినగర్, మహారాణివీధి తదితర కాలనీల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 54వ వార్డు అధ్యక్షుడు కార్తీక్ కుట్టా, మలేరియా వి భాగం సిబ్బంది ఎస్.నాగరాజు, ఎం. కృష్ణమోహన్, సామాజిక కార్యకర్తల భూషణరావు, పాఠశాల కరస్పాండెంట్ డి.వి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ముస్లిం తాటిచెట్లపాలెంలో..

**అక్కయ్యపాలెం :** టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేశ్ ఆధ్వర్యంలో మలేరియా, డెంగ్యూ, అతిసార వాధులపై 44వ వార్డు ముస్లి తాటిచెట్ల పాలెంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కాళ్ల గౌరీశంకర్ నా యుడు, బీజేపీ అధ్యక్షుడు ఎన్.రఘునాథ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, నాయకులు సోనా, పుష్ప, ఖుసిదా తదితరులు పాల్గొన్నారు.



మర్రిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



## హెల్మెట్ ధారణపై బీచ్‌రోడ్డులో 1కే వాక్ రేపు

**మహారాణిపేట, జూలై 16:** ద్విచక్ర వాహనదారుల హెల్మెట్ ధారణపై అవగాహనకు ఈ నెల 18 వ తేదీన బీచ్ రోడ్డులో 1కే వాక్ నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఎమ్ఎల్ఎస్‌సీలు న్యాయ వాదులు, పీఎల్‌వీలు , విద్యార్థుల ఆధ్వర్యంలో 18 వతేదీ ఉదయం 6.30కు బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి పోలీస్ మెస్ వరకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ 1కే వాక్ ప్రజా ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఆ రోజు జిల్లా వ్యాప్తంగా ప్రమాదాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు జరుపుతారని న్యాయమూర్తి తెలిపారు.

# రైళ్లు మళ్లింపు, రీ షెడ్యూల్

**విశాఖపట్నం, జూలై 16:** విజయవాడ డివిజన్ పరిధిలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనుండగా, మరికొన్ని రైళ్లను ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఈనెల 22, 29న ఎర్నాకులం-హౌరా అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22878) వయా రేణుగుంట, ఎర్రగుంట్ల, నంద్యాల, గుంటూరు, కృష్ణా కెనాల్‌మీదుగా, సంత్రాగచ్చి-తంబరం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22841) వయా కృష్ణా కెనాల్, గుంటూరు, నంద్యాల, ఎర్రగుంట్ల, రేణుగుంట, చెన్నై ఎగ్మోర్ మీ దుగా, ఈనెల 22న హౌరా-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22863) వయా కృష్ణా కెనాల్, గుంటూరు, నంద్యాల, ఎర్రగుంట్ల, రేణుగుంట మీదుగా నడుస్తాయి.

### రీ షెడ్యూల్..

ఈనెల 21న మల్దాటౌన్-బెంగళూరు అమృత భారత్ ఎక్స్‌ప్రెస్ (13434), ఈనెల 21, 26న హౌరా-మైసూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22817), ఈనెల 18, 21, 25న హౌరా-తిరుచిరాపల్లి ఎక్స్‌ప్రెస్ (12663), ఈనెల 22, 29న హౌరా-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (12665), ఈ నెల 26న సిలిఘాట్ టౌన్-తంబరం ఎక్స్‌ప్రెస్ (15630), ఈనెల 22న న్యూటిన్సుకియా- తంబరం ఎక్స్‌ప్రెస్ (15930), ఈనెల 23, 26తేదీల్లో సంత్రాగచ్చి-చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (22807) రైళ్లు ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి గంటన్నర ఆలస్యంగా బయలుదేరుతాయి.

### పలు రైళ్ల గమ్యాల కుదింపు

తంబరం స్టేషన్‌లో నిర్మాణ పనులు చేపట్టనున్నందున పలు రైళ్ల గమ్యాలను కుదించినట్టు సీనియర్ డీసీఎం తెలిపారు. దీంతో జసిదిహ్-తంబరం ఎక్స్‌ప్రెస్ (12376) 27న చెన్నై ఎగ్మోర్ వరకు, సంత్రాగచ్చి-తంబరం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22841) ఈనెల 22, 29న చెన్నై బీచ్ వరకు, సిలిఘాట్ టౌన్- తంబరం ఎక్స్‌ప్రెస్ (15630) చెన్నై సెంట్రల్ వరకు, న్యూ టిన్సుకియా-తంబరం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (15930) ఈనెల 22, 29న చెన్నై ఎగ్మోర్ వరకు నడుస్తుంది. పైన పేర్కొన్న రైళ్లు తంబరం స్టేషన్ చేరవని ఆయన స్పష్టం చేశారు. అలాగే తిరుగు ప్రయాణంలోని తంబరం- జసిదిహ్ ఎక్స్‌ప్రెస్ (12375) ఈనెల 27న చెన్నై ఎగ్మోర్ నుంచి, తంబరం- సంత్రాగచ్చి అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22842) ఈనెల 24, 31న చెన్నై ఎగ్మోర్ నుంచి, తంబరం- సిలిఘాట్ టౌన్ ఎక్స్‌ప్రెస్ (15629) ఈనెల 29న చెన్నై ఎగ్మోర్ నుంచి, తంబరం-న్యూ టిన్సుకియా ఎక్స్‌ప్రెస్ (15929) ఈనెల 25న చెన్నై ఎగ్మోర్ నుంచి బయలు దేరుతాయని పేర్కొన్నారు.

### దువ్వాడ మీదుగా తిరునెల్వేలి, షాలిమార్ మధ్య ప్రత్యేక రైలు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వయా దువ్వాడ మీదుగా తిరునెల్వేలి, షాలిమార్ మధ్య ప్రత్యేక రైళ్ల సర్వీసులను ప్రవేశపెడుతున్నట్టు ఆయన తెలిపారు. 06087 నంబరు గల రైలు ఈనెల 18, 25న (ప్రతి గురువారం) తెల్లవారుజాము 1.50 గంటలకు తిరునెల్వేలిలో బయలుదేరి మర్నాడు ఉదయం 4.57 గంటలకు దువ్వాడ, రాత్రి 9.00 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరిగి ఈనెల 20, 27న (ప్రతి శనివారం) సాయంత్రం 5.10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 7.52 గంటలకు దువ్వాడ, సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు తిరునెల్వేలి చేరుతుంది.



## శ్రీకృష్ణావతారంలో జగన్నాథుడు

భీమునిపట్నం, జూలై 16: పట్టణంలోని ఇంద్రజ్యుమ్న మందిరంలో రథయాత్ర ఉత్సవాల్లో భా గంగా మంగళవారం జగన్నాథస్వామి శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకుడు రొంపిచర్ల కృష్ణమాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం ప్రధాన అర్చకులు రొంపిచర్ల సింగరాచార్యులు శ్రీకృష్ణావతార విశిష్టతను భక్తులకు వివరించారు. బుధవారం స్వామివారు శ్రీవైకుంఠనారాయణావతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సాయంత్రం మారు రథోత్సవం ఘనంగా జరుగనుంది.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా

ఆనందపురం, జూలై 16: మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి మంగళవారం భీమిలి కోర్టు జరిమానా విధించింది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు ఇటీవల తనిఖీలు నిర్వహించిన ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. వీరిని కోర్టులో ప్రవేశపెట్టగా భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య ఒక్కో నిందితుడికి రూ. 10వేలు చొప్పున మొత్తంగా రూ. 70 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్టు ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు.

## తాగునీటికి అంతరాయం రేపు

వెంకోజీపాలెం, జూలై 16: జీవీఎంసీ సీతమ్మధార టీపీటీ కాలనీ ప్రాంతంలోని 400 ఎంఎం పంపింగ్ మెయిన్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 18న తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-3 టీపీటీకాలనీ, పీఅండ్‌టీ కాలనీ, నక్కవానిపాలెం, చైతన్యనగర్, క్రాంతి నగర్, శారదస్కూల్ ఏరియా, రామకృష్ణనగర్, లలిత నగర్, శంకరమఠం మెయిన్ రోడ్డు, చిన్నూరు, మంగళ వీధి ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు. నగర వాసులు సహకరించాలని కోరారు. అత్యవసర ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.

## 'డబ్బులిస్తేనే టీసీ'

మద్దిలపాలెం, జూలై 16: డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీసీలు ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. డిగ్రీ విద్యార్థుల నుంచి రూ.200, పీజీ విద్యార్థుల వద్ద రూ.300 తీసుకుంటున్నారని తెలిపారు. కళాశాల జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ డబ్బు డిమాండ్ చేస్తున్నాడన్నారు. దీనిపై ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు వద్ద ప్రస్తావించగా, డబ్బులు తీసుకుని టీసీలు ఇస్తున్న విషయం విద్యార్థులెవరూ తన దృష్టికి తీసుకుని రాలేదన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

## న్యాయ చట్టాలపై అవగాహన ఉండాలి

పద్మనాభం, జూలై 16: నూతన న్యాయ చట్టాల పట్ల మహిళలు అవగాహన పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి చెప్పారు. మద్ది అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ శక్తి సంకల్ప 100 రోజుల మహిళా సాధికారతలో భాగంగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మహిళల భద్రత కోసంఅమలు చేస్తున్న వన్‌స్టాప్ సెంటర్, హెల్ప్‌లైన్ నారీ అదాలత్ సద్వినియోగ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

## సినిమా గైడ్

● **భారతీయుడు-2:** జగదాంబ, శారద, మెలోడీ, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి),

● **కల్కి:** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా** : శ్రీవెంకటేశ్వర, శ్రీ నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

## రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 58, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 70, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజ్ 30, క్యారెట్ 28, దొండకాయలు 30, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 140, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 40, కీరదోస 26, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 95, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

### కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 575 |
| విజయనగరం | 579 |
| శ్రీకాకుళం | 579 |

### చికెన్ ధరలు

బ్యాగ్

| | | |
|---|---|---|
| రైతు ధర | -- | 90 |
| ఫారం ధర | -- | 110 |
| విత్ స్కిన్ | -- | 190 |
| స్కిన్‌లెస్ | -- | 200 |

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

# అధ్వాన రహదారులతో అవస్థలు

- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం తవ్వేసిన వైనం
- పూర్తిస్థాయిలో గోతులను పూడ్చకపోవడంతో ప్రమాదాలు
- జీవీఎంసీ 15, 16 వార్డులలో పరిస్థితి



శెట్టిబలిజ వీధి, జేఆర్ నగర్, పాతవెంకోజీపాలెంలో యూజీడీ గోతులు

వెంకోజీపాలెం, జూలై 16: జీవీఎంసీ 15, 16వ వార్డుల పరిధి పాతవెంకోజీపాలెం, జేఆర్‌నగర్, కేఆర్ఎం కాలనీలో వీధుల నుంచి ప్రధాన రహదారులకు వెళ్లే రోడ్లు రాళ్లు తేలి అధ్వానంగా ఉండడంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. నాలుగు నెలలు క్రితం సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు జీవీఎంసీ అధికారులు హడావిడిగా భూగర్భ డ్రైనేజీ పైపులైను విస్తరించేందుకు ఆయా వీధుల్లోనూ, ప్రధాన రహదారుల్లోనూ ఇష్టానుసారం గోతులు తవ్వారు. నూతన పైపులైన్లు వేసిన తరువాత పూడ్చకుండా వదిలేశారు. దీంతో పాదచారులు, వాహనదారులు ఆయా మార్గాల్లో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ పరిధిలో మరిన్ని ప్రమాదాలు సంభవించకముందే అధికారులు తక్షణమే స్పందించి గోతుల పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని 15, 16 వార్డుల పరిధిలోని ప్రజలు కోరుతున్నారు.

## హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ



భీమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, విద్యార్థులు

భీమునిపట్నం, జూలై 16: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వక్తలు సూచించారు. పట్టణంలో న్యాయవాదులు, విద్యార్థులు, డైట్ ఛాత్రోపాధ్యాయులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ, భీమిలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూకాలమ్మ గుడి నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్‌రోడ్డు, గంటస్తంభం, పాతబస్టాండ్ మీదుగా కోర్టు వరకూసాగింది. ర్యాలీలో 15వ మెట్రోపాలిటన్ కోర్టు మేజిస్ట్రేట్ డి.సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ పార్వతీశం, కె.ఎస్.ఎం. సుధాకర్, కోశాధికారి ముమ్మిడిశెట్టి సునీల్, ఏజీపీ ఎం.సి.హెచ్. పాత్రుడు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ నమ్మి సూరిబాబు, డి.కనకమహాలక్ష్మి, వి.అరుణకుమారి, సీనియరు న్యాయవాదు పి.ఎస్.ఎల్.కె. భరద్వాజ్, బి.ఈశ్వరరావు, ఎస్.సురేష్‌రెడ్డి, బాలభాస్కర్, డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు, ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి, మాజీ కౌన్సిలరు మైలపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం తప్పించుకోవచ్చన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం తప్పనిసరి అన్నారు.

## కార్యాలయాలకు సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు



పోలీస్‌స్టేషన్‌లో ఫొటోలు అందిస్తున్న జనసేన నేతలు

భీమునిపట్నం, జూలై 16: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలను పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలకు జనసేన నాయకులు మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ ఆదేశాల మేరకు వార్డు పార్టీ అధ్యక్షులు నీలాపు శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ జి.హరీష్‌కు, చిన్నబజారు సచివాలయంలో సిబ్బందికి ఈ చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎ.సత్యనారాయణ, జి. చిన్న, గోవింద, ఎం.నర్సింగ్, ఎన్. నాగేశ్వరరావు, ఎస్. శేషు, నాయుడు, సతీష్ పాల్గొన్నారు.

## అనాథ శవానికి అంత్యక్రియలు

ఆరిలోవ, జూలై 16: జీవీఎంసీ పదో వార్డు తోటగరువు కొండవాలు ప్రాంతం లోగల బీఎస్ఆర్ నగర్‌లో అనాథ మహిళ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో సంఘ నేత మాణిక్యాలు ఉపకార ట్రస్టు సభ్యులకు విషయం తెలియపరిచారు. ఈ నేపథ్యంలో ఉపకార ట్రస్టు అధ్యక్షుడు కంచెర్ల అచ్చుతరావు అంత్యక్రియలకు అవసరమైన నగదు సహాయం చేశారు. సంఘ సభ్యులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. సంఘం తరఫున చేపట్టే ఇలాంటి కార్యక్రమాలకు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

# స్నేహ భావం పెంపునకు గ్రామ దేవతల ఉత్సవాలు దోహదం

- విశాఖ లోక్‌సభ సభ్యుడు ఎం.శ్రీభరత్



అమ్మవారి పూజల్లో ఎంపీ శ్రీభరత్, నాయకులు



ఎమ్మెల్యే గంటాను సత్కరించిన ఆలయ సభ్యులు

ఎండాడ, జూలై 16: గ్రామ దేవతల ఉత్సవాలతో ప్రజల్లో స్నేహ భావం పెంపొందుతుందని ఎంపీ ఎం.శ్రీభరత్ అభిప్రాయపడ్డారు. ఎండాడలో దుర్గాలమ్మ అమ్మవారి పండగ సందర్భంగా ఆలయంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండాడ ప్రాంతం అభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. ఈ ప్రాంతంలో నివాసముంటున్న దేశంలోని వివిధ రాష్ట్రాలవారు ఈ పండగలలో మమేకమవుతారన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జనసేన నేత పంచకర్ల సందీప్, విజయ్‌బాబు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ నాయకులను గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాదు రాజు ఆధ్వర్యంలో జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నొడగల అప్పారావు, టీడీపీ నాయకులు చెట్టుపల్లి గోపి, చినగోపి, ఒమ్మిబాబూరావు, అక్కరబోయిన రాంబాబు, చెట్టుపల్లి సన్యాసిరావు, భావన, జనసేన నాయకులు శాఖరీ శ్రీనివాస్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెదవాల్తేరు, జూలై 16: పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని, డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ 21వ వార్డు టీడీపీ నేత పీతల అవినాష్ కోరారు. శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై నిర్వహించిన ర్యాలీని అవినాష్ ప్రారంభించారు. జీవీఎంసీ సిబ్బంది సరఫరా చేసిన డస్ట్‌బిన్లను వినియోగించుకుని, తడి, పొడి, హానికర వ్యర్థాలను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీవో ఎస్ ఇందీవర, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



పెదగదిలిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

**ఆరిలోవ:** మలేరియా డెంగ్యూ , అతిసారంపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా అధికారులు సూచించారు. మంగళవారం పెదగదిలి జంక్షన్‌లో అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూకరత్నం, జగదీశ్వరి, విజయకుమారి, స్వాతి, ఆశ వర్కర్లు, వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, నాయకులు గాడి సత్యం, ఒమ్మి పోలారావు తదితరులు పాల్గొన్నారు.

**ఆరిలోవ:** దోమలు వృద్ధి చెందకుండా పరసరాలు చూసుకోవాలని జోన్ టు జెడ్సీ వల్లీ, వైద్యాధికారి కిశోర్ సూచించారు. పైనాపిల్‌కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీల వాసులతో మంగళవారం మాట్లాడారు



పెదవాల్తేరులో అవగాహన ర్యాలీ...

వర్షాకాలంలో నీరు నిలువ లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు దోమలు వృద్ధి చెందితే సీజనల్ వ్యాధులు విజృంభిస్తాయన్నారు. కాలువల్లో మురుగునీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చూసుకోవాలని, చెత్తను వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మారావు. మలేరియా ఇన్‌స్పెక్టర్ మంగరాజు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పంటల సాగు హక్కు పత్రంతో మేలు: వ్యవసాయాధికారి

భీమునిపట్నం, జూలై 16: పంటల సాగు హక్కు పత్రం పొందడం ద్వారా కౌలు రైతులకు రాయితీ, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వరిస్తాయని మండల వ్యవసాయాధికారి శివకోమలి తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో పంట సాగుహక్కు పత్రం పొందడంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంటలను సాగుచేసే ప్రతీ కౌలు రైతు పంట సాగుహక్కు పత్రం కోసం సంబంధిత భూ యజమాని ఆధార్‌కార్డు, పాస్‌బుక్‌లతో పాటు ఇరు రైతుల సంతకాలతో ధ్రువ పత్రాలను వీఆర్వోలకు అందజేయాలన్నారు. వాటిని పరిశీలించిన తర్వాత వారు కౌలు కార్డు నమోదు చేస్తారన్నారు. ఈ పత్రానికి 11 నెలల పాటు మా త్రమే హక్కు ఉంటుందన్నారు. కౌలురైతులు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు లబ్ధి పొందవచ్చునన్నారు. గ్రామాలలో కౌలు రైతులకు కౌలు కార్డు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీటీ సూరిశెట్టి శ్రీనుబాబు, వీఆర్వోలు, రైతు సేవ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శివకోమలి

# సింహాచలేశుడికి ఒడిశా దాసుడి ఊంజల సేవ

సింహాచలం, జూలై 16: వరాహలక్ష్మీనృసింహస్వామికి ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్ దాసుడు భక్తిశ్రద్ధలతో ఊంజల సేవ జరిపించారు. సాయంత్రం స్వామివారి పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పెద్ద శేష వాహనంపై పాలకడలిలో శయనించిన విష్ణుమూర్తిగా, పాదసేవ చేస్తున్న లక్ష్మీదేవిగా ఉభయ దేవేరులతో అలంకరించిన తీరు ప్రత్యేకత సంతరించుకుంది. దాసుడి గోత్రనామాలతోపాటు లోకకల్యాణార్థం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలను సమర్పించారు. అనంతరం ఒడిశా భక్తులు గీతాలపనల నడుమ దాసుడు దంపతులు స్వామివారి ఊంజల (ఊయల)ను ఊపుతూ చమరసేవను చేయగా అర్చకులు పుష్పాలతో విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి సతీసమేతంగా పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. దానిలో భాగంగా మంగళవారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు కావించి మంగళవాయిద్యాలు, వేద మంత్రాల మధ జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణలు జరిపిన తరువాత తలంబ్రాలను వేడుకగా నిర్వహించారు. మంత్రపుష్పం కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

### అమ్మవార్లకు పసుపు కుంకుమల సమర్పణ

సింహాచలం: సింహగిరి ప్రజల ఆరాధ్య గ్రామదేవతలు పాదాలమ్మ, బంగారమ్మలకు పసుపు కుంకుమలు సమర్పించారు. అమ్మవార్ల వార్షిక పండగను పురస్కరించుకుని మంగళవారం ఉదయం అర్చకులు ప్రత్యేక అభిషేకాలు పూజలు జరిపారు. భక్తులు పసుపు కుంకుమలు, చీరలు ఇతర కానులకను మొక్కుబడులుగా చెల్లించారు. సింహాచల ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి అమ్మవార్లకు పూజలు చేశారు. ఉత్సవంలో కస్తూరి సత్తిబాబు, దొంతల శంకర్, వరదా నరసింహమూర్తి, మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవంలో పాల్గొన్న ఒడిశా దాసుడు, ఈఓ, భక్తులు

## సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

- ఎమ్మెల్యే గంటాకు టీచర్స్ యూనియన్ అధ్యక్షుడి వినతి



ఎమ్మెల్యే గంటాకు వినతి పత్రం ఇస్తున్న దేముడు, తదితరులు

ఎంవీపీ కాలనీ, జూలై 16: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారని ఏపీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు పేర్కొన్నారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంగళవారం ఎంవీపీ కాలనీలోని గంటా నివాసంలో ఆయనను కలుసుకుని సమర్పించారు. ఈ సందర్భంగా గంటాకు ఉపాధ్యాయుల సమస్యలను వివరించామన్నారు.

## వైభవంగా కనకమ్మ అమ్మవారి జాతర



పూజల్లో ఎమ్మెల్యే వెలగపూడి కుమారుడు ప్రతాప్ రుద్ర, టీడీపీ నేతలు

వెంకోజీపాలెం, జూలై 16: ఇసుకతోట గవర వీధి కనకదుర్గమాంబ అమ్మవారి జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. సీతారామ సేవా మండలి ఆధ్వర్యంలో జరిగిన అనుపోత్సవంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమాభిషేకాలు నిర్వహించారు.ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర, వార్డు టీడీపీ అధ్యక్షులు నారు గోపి, ముగడ వాసు, పల్లా ఉమారాణి, మొల్లి శోభ, పల్లా బాబులు పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సదరం పట్టు నుంచి ఊరేగించారు. కార్యక్రమంలో కె.బాబు, కోరిబిల్లి శ్రీను, పెంటకోట రమేష్, అప్పలరాజు, ఎస్.బుజ్జి, పెంటకోట చిన్నాబాబు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

భీమునిపట్నం, జూలై 16: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉం టూ, జీవితాలకు బంగారుబాటలు వేసుకోవాలని భీమిలి సర్కిల్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ జి.చిన్నమనాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్‌డీపీఎస్ వంద రోజులు కార్యాచరణలో భాగంగా విద్యార్థినులకు గంజాయి, హెరాయిన్, కొకైన్ తదితర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, విద్యార్థినులు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

## సెలవుల్లో శిలాఫలకం ఏర్పాటుపై నిరసన



కృష్ణా లైబ్రరీ వద్ద నిరసన తెలుపుతున్న ఏయూ విద్యార్థులు, పరిశోధకులు

వెంకోజీపాలెం, జూలై 16: ఏయూలోని కృష్ణా లైబ్రరీ వద్ద సెలవు దినాల్లో శిలాఫలకాన్ని ఏర్పాటు చేయడం, తప్పులు తడకలుగా ఉండడం, అనేక పీహెచ్‌డీలు డబుల్ ఎంట్రీలు ఉండడంపై ఏయూ విద్యార్థులు, పరిశోధకులు, లైబ్రరీ మెయిన్ గేట్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. వర్సిటీకి వైస్ చాన్సలర్‌ను నియమించాలని, మాజీ వీసీ, రిజిస్ట్రార్‌లపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## ఫైల్స్ కాలిపోవడంపై అనుమానాలు

వెంకోజీపాలెం, జూలై 16: ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యాలయంలో ఫైల్స్ కాలిపోవడం అనుమానస్పదంగా ఉందని ఏయూ పరిరక్షణ సమితి సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వెంటనే కళాశాల మాజీ ప్రిన్సిపాల్‌పై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## 'జీవ వైవిధ్యానికి పాములు దోహదం'

ఆరిలోవ, జూలై 16: జీవ వైవిధ్యానికి పాములు దోహదం చేస్తాయని, వాటి పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అటవీశాఖ పీసీసీఎఫ్ శాంతికుమారి పాండే అన్నారు. ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో పాముల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పాములు రైతు నేస్తాలన్నారు. పంటల పరిరక్షణలో దోహదకారులన్నారు. పాములను విచక్షణా రహితంగా చంపరాదని తెలిపారు. ఈ సందర్భంగా 32 రకాల పాములతో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈస్టరన్ వైల్డ్ లైఫ్ సొసైటీతో కలసి నిర్వహించిన సదస్సులో జూ క్యూరేటర్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఈవో



విద్యా కిట్లను పరిశీలిస్తున్న డీఈఓ చంద్రకళ

పద్మనాభం, జూలై 16: మండల విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మంగళవారం తనిఖీ విద్యార్థుల కిట్లను పరిశీలించారు. స్టాకు రిజస్టరును తనిఖీ చేశారు. అనంతరం డేటా ఎంట్రీ ఆపరేటర్లు చేపడుతున్న ఏకీకృత జిల్లా విద్యా సమాచార వ్యవస్థ డేటాను పరిశీలించారు. ఆమె వెంట సమగ్ర శిక్ష ఏపీఓ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## లింక్ రోడ్డు నాణ్యతలో డొల్లతనం



చిన్నపాటి వర్షానికే కొట్టుకుపోయిన రహదారి

సింహాచలం, జూలై 16: గ్రేటర్ 98వ వార్డు పరిధిలోని రెండు కిలోమీటర్ల పొడవైన బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణంలో అంతర్భాగంగా జీవీఎంసీ అధికారులు నిర్మించిన లింక్‌రోడ్డు నాణ్యత అంతంత మాత్రంగా ఉంది. ఈ విషయం సోమవారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికే తేటతెల్లమైంది. వార్డులో లింక్‌రోడ్లను హడావిడిగా చేపట్టారు. కుమ్మరివీధి కూడలి వద్ద నిర్మించిన తాత్కాలిక లింక్ రోడ్డు వర్షానికి కోతకు గురైంది. దానికి అనుకుని ఉన్న ఇండ్లలోని బురద, వర్షపునీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తక్షణం అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించి శాశ్వత ప్రాతిపదికన లింక్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

## ముస్తాబవుతున్న అన్నక్యాంటీన్లు




బీఎస్ఆర్‌టీఎస్ రోడ్డులో అన్న క్యాంటీన్

ఆరిలోవ, జూలై 16: అన్నక్యాంటీన్లు ప్రారంభానికి ముస్తాబవుతున్నాయి. గ్రేటర్ 9వవార్డు సంజయగాంధీ కాలనీ బీఆర్‌టీఎస్ రోడ్డు, 13వ వార్డులో భవనాలకు మరమ్మతులు చేపట్టి రంగువేశారు. వీటిని ఆగస్టు 15న పునః ప్రారంభించనున్నారు.